# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ | మంగళవారం 1-11-2022 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :29 | సంచిక: 67 | పేజీలు:6 | వెల: రూ.1/-


## కాంకేర్‌లో ఎదురుకాల్పులు.. ఇద్దరు మావోలు హతం

రాయ్‌పూర్, అక్టోబర్ 31:ఛత్తీస్‌గఢ్‌లో మావోలు, భద్రతా బలగాలకు మధ్య ఎదురుకాల్పులు జరిగాయి. ఈ ఘటనలో ఇద్దరు మావోలు హతమయ్యారు. ఈ విషయాన్ని పోలీసు అధికారులు ధ్రువీకరించారు. కాంకేర్ జిల్లాలోని సిక్సోడ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని కడ్మే శివారు అటవీ ప్రాంతంలో సోమవారం తెల్లవారు జామున 4 గంటల సమయంలో ఎదురుకాల్పులు చోటు చేసుకున్నాయి.

జిల్లా రిజర్వ్ గార్డ్ (ఆఖీఉ), సరిహద్దు భద్రతా దళం (బాఈ) ప్రత్యేక బృందాలు ఆపరేషన్‌లో భాగంగా కూంబింగ్ నిర్వహిస్తుండగా ఎదురుకాల్పులు జరిగాయని అధికారులు చెప్పారు. కొందరు మావోయిస్టులు డీజీఆర్ పెట్రోలింగ్ బృందంపై కాల్పులు జరిపారని అధికారులు పేర్కొన్నారు. కాల్పుల అనంతరం సంఘటనా స్థలంలో ఇద్దరి మృతదేహాలను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. మృతుల వివరాలు తెలియరాలేదని, సమీప ప్రాంతాల్లో సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని పోలీసులు వివరించారు.

## మునుగోడులో ముమ్మాటికి టీఆర్ఎస్‌దే గెలుపు : మంత్రి హరీష్ రావు




హైదరాబాద్, అక్టోబర్ 31:మునుగోడు ప్రజలకు అన్ని ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందాయని, టీఆర్ఎస్ ప్రభుత్వం వల్ల నియోజక వర్గంలోని ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలు చేరుతున్నాయని మంత్రి హరీష్ రావు అన్నారు. ఎనిమిదేండ్లలో ఏం చేశామో తాము చూపిస్తామని, మరి బీజేపీ ఏం చేసిందో చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. గ్యాస్ పెట్రోల్ ధరలు పెంచిన ఘనత బీజేపీదేనని విమర్శించారు. బీజేపీ అంటే పెంచుడు.. టీఆర్ఎస్ అంటే పంచుడని మంత్రి చెప్పారు. కిషన్ రెడ్డి, బండి సంజయ్ స్థాయి ఏంటో ఢిల్లీ దూతలే చెప్పారని, ఇద్దరు నేతలవి నకిలీ మాటలు, వెకిలి చేష్టలని విమర్శించారు. మునుగోడు నియోజక వర్గంలో చరిత్ర సృష్టించే విధంగా సభ నిర్వహించామన్నారు. సీఎం కేసీఆర్ సభ ప్రజాభిమానాన్ని చాటిచెప్పిందన్నారు. మునుగోడులో గెలుపు ముమ్మాటికీ ఖాయమైందని చెప్పారు. దశాబ్దాల ఫ్లోరైడ్ భూతాన్ని తరిమికొట్టిన ఘనత సీఎం కేసీఆర్‌దేనని వెల్లడించారు. పార్టీలో చేరికల గురించి బీజేపీ మాట్లాడటం అంటే దయ్యాలు వేదాలు వల్లించినట్టేనని ఎద్దేవా చేశారు. వందల కోట్లు ఆశ చూపి తమ ఎమ్మెల్యేలను కొనుగోలు చేయాలని ప్రయత్నం చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అయినా బీజేపీ ఎత్తుగడలను ఎమ్మెల్యేలు తిప్పికొట్టారని చెప్పారు. మీరు విలీనం చేసుకోవచ్చుకానీ తాము అదేపని చేస్తే తప్పా అని నిలదీశారు. ఇతర పార్టీల ఎంపీలను బీజేపీలో చేర్చుకుంటే తప్పులేదా అని ప్రశ్నించారు.

## మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి : సీఈవో

హైదరాబాద్, అక్టోబర్ 31: నల్లగొండ జిల్లా పరిధిలోని మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్ రాజ్ తెలిపారు. ఇవాళ ఆయన మీడియాతో మాట్లాడారు. మునుగోడు నియోజకవర్గం పరిధిలో 2,41,855 మంది ఓటర్లు ఉన్నారు. ఇందులో 50 మంది సర్వీస్ ఓటర్లు ఉన్నారు. 5,686 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ఉన్నప్పటికీ, కేవలం 739 మంది మాత్రమే దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం పోలింగ్ కేంద్రాలు 298 ఉన్నాయన్నారు. అర్బన్‌లో 35, రూరల్‌లో 263 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 105 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించాం. మునుగోడు నియోజకవర్గ పరిధిలో ఓటరు స్లిప్పుల పంపిణీ ఇప్పటికే పూర్తయిందని చెప్పారు. ఆన్‌లైన్‌లో కూడా ఓటరు స్లిప్పులను డౌన్ లోడ్ చేసుకోవచ్చని సూచించారు. తొలిసారి కొత్త నమూనా ఓటరు కార్డులను పంపిణీ చేశామని తెలిపారు.

### ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్..

అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశామని స్పష్టం చేశారు. ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్ కొనసాగనుందని పేర్కొన్నారు. అన్ని పోలింగ్ స్టేషన్లలో మెడికల్ టీమ్స్‌ను అందుబాటులో ఉంచామన్నారు. 3,366 పోలీసు సిబ్బందితో పాటు 15 కంపెనీల కేంద్ర బలగాలు అందుబాటులో ఉన్నాయన్నారు. నియోజకవర్గం పరిధిలో 100 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గ పరిధిలో రూ. 6.80 కోట్ల నగదు స్వాధీనం చేసుకున్నాం. 4500 లీటర్ల మద్యం సీజ్ చేశామన్నారు.

నేడు సాయంత్రం 6 గంటల తర్వాత నియోజకవర్గ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తామన్నారు. ప్రత్యేక యాప్ ద్వారా గంట గంటకు ఓటింగ్ శాతాన్ని తెలియజేస్తామన్నారు. రేపు సాయంత్రం 6 తర్వాత బల్క్ మేసేజ్‌లు వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బయటనుంచి వచ్చినవారు నియోజకవర్గంలో ఉండకూడదు. కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి వివరణను ఈసీకి నివేదించామని వికాస్ రాజ్ మీడియాకు తెలిపారు.

## వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చింది సీఎం కేసీఆరే : మంత్రి తలసాని




నల్లగొండ, అక్టోబర్ 31: వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చి రైతులను ఆదుకున్న ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్ కే దక్కుతుందని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. మునుగోడు ఉప ఎన్నికలో భాగంగా నాంపల్లిలోని అంగడి బజార్ లో మంత్రి తలసాని స్థానిక రైతులతో ముచ్చటించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటుకు ముందు పంటలు సరిగా పండక, గిట్టుబాటు ధర లభించక రైతులు ఎంతో నష్టపోయారని, వ్యవసాయం అంటే దండగా అని భావించే వారని గుర్తు చేశారు.

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో పంట పెట్టుబడుల కోసం ఎకరానికి రూ. 10 వేల ఆర్థిక సహాయం అందిస్తున్నామని తెలిపారు. 24 గంటల పాటు విద్యుత్ సరఫరా, సకాలంలో విత్తనాలు అందుబాటులో ఉంచడం, నూతన సాగునీటి ప్రాజెక్ట్ ల నిర్మాణంతో పంట సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని చెప్పారు. అంతే కాకుండా రైతులు పండించిన ధాన్యం కూడా తెలంగాణ ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని తెలిపారు. రైతు ప్రమాదవశాత్తు మరణిస్తే రైతు బీమా కింద రూ. 5 లక్షల ఆర్థిక సహాయం అందించి ఆ రైతు కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటున్నదని పేర్కొన్నారు.

అనేక విధాలుగా తెలంగాణ ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తుంటే కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం డీజిల్, పెట్రోల్ ధరలను అడ్డగోలుగా పెంచి రైతులపై భారం మోపుతుందని మండిపడ్డారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలతో ఎరువులు, నిత్యావసర వస్తువులు, వ్యవసాయ పెట్టుబడులపై ఆర్థిక భారం పడుతుందన్నారు. రైతులకు చేయూత అందించి ఆదుకోకపోగా పెనుభారం మోపడం న్యాయమా అని ప్రశ్నించారు. ఈ ఎన్నికల లో ఓట్ల కోసం వచ్చే బీజేపీ, కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. అన్ని రకాలుగా అండగా ఉంటూ మీ అభివృద్ధికి కృషి చేస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి మద్దతు తెలపాలని, కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డిని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ ఓటర్లను కోరారు.

## ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికీ లొంగలేదు.. లొంగిపోరు: స్వామిగౌడ్




హైదరాబాద్, అక్టోబర్ 31:ప్రభుత్వ ఉద్యోగులు ఎవరికీ లొంగలేదు, ఎప్పటికీ లొంగిపోరని టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు, టీఆర్ఎస్ పార్టీ నేత స్వామిగౌడ్ అన్నారు. తెలంగాణ ఉద్యోగా సంఘాలు ఎవరికీ అమ్ముడుపోవన్నారు. ఉద్యోగుల వేతనాల కోసం సంఘాలు పోరాడుతూనే ఉంటాయని చెప్పారు. తెలంగాణ భవన్‌లో టీఆర్ఎస్ నేతలు దేవీ ప్రసాద్, సుబ్బారావుతో కలిసిన స్వామిగౌడ్ మీడియాతో మాట్లాడారు. ఉద్యోగులపై బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వారి వాఖ్యలు ఉద్యోగుల కుటుంబాలను బాధపెడుతున్నాయని చెప్పారు.

నాడు ఉద్యోగాలు పోతాయని బెదిరించినప్పటికీ భయపడకుండా ఉద్యమంలో పాల్గొన్నామని చెప్పారు. ఈరోజు ఆరోపణలు చేస్తున్న బీజేపీ నేతలు రాష్ట్ర సాధన ఉద్యమ సమయంలో ఎక్కడున్నారని స్వామిగౌడ్ ప్రశ్నించారు. లాఠీ దెబ్బలు తిని జైళ్లకు వెళ్లినప్పుడు ఎప్పుడైనా ఓదార్చారా అని నిలదీశారు. ఆర్థిక ఒడిదొడుకులు ఉన్నప్పుడు జీతాలు ఆలస్యమవడం సహజమన్నారు. గతంలోనూ పలు సందర్భాల్లో జీతాలు ఆలస్యమయ్యాయని వెల్లడించారు. ప్రకృతి విపత్తులు వచ్చినప్పుడు ఉద్యోగులే ప్రభుత్వానికి అండగా నిలిచారని ఆయన చెప్పారు.

తెలంగాణ కావాలనే ఆకాంక్షను ఉద్యోగులు బహిరంగంగా సమర్థించారని.. ఉద్యమాల్లో పాల్గొన్నారని, అభివృద్ధిలోనూ భాగస్వాములవుతామని స్పష్టం చేశారు. కిషన్ రెడ్డి పోడు యాత్ర చేసినప్పుడు కూడా టీఎన్జీవోలు మద్దతిచ్చారని గుర్తుచేశారు. బీజేపీ నేతల అనుచిత వ్యాఖ్యలతో ఆ పార్టీ అభిమానులు కూడా వారికి దూరమవుతారని హెచ్చరించారు.

### టీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని పిలుపునిస్తే తప్పేంటి: దేవీప్రసాద్

బండి సంజయ్ ఉద్యోగులకు, ఉద్యోగ సంఘాలకు బహిరంగ క్షమాపణ చెప్పాలని టీఆర్ఎస్ నేత దేవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. బండి ఇలాంటి వ్యాఖ్యలు ఇదే మొదటిసారి కాదని, గతంలోనూ నోరు జారారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రధాని నుంచి బండి సంజయ్ వరకు తెలంగాణ ఆకాంక్షలపై గతంలో కామెంట్లు చేశారని విమర్శించారు. తెలంగాణ కోసం చివరి వరకు నిలబడిన వాళ్లు టీఎన్జీవోలన్నారు. టీఎన్జీవో నేతలు ఎక్కువ మంది టీఆర్ఎస్‌లో ఉన్నారని బీజేపీ అక్కసని విమర్శించారు.

ఉద్యోగుల డిమాండ్లు పరిష్కరిస్తున్న టీఆర్ఎస్‌కు ఓటెయ్యాలని పిలుపునిస్తే తప్పేంటని దేవీప్రసాద్ ప్రశ్నించారు. సకలజనుల సమ్మె 42 రోజులు చేస్తే బండి సంజయ్ ఏనాడు మద్దతు తెలుపలేదన్నారు. కరీంనగర్ జిల్లాలో లక్షమంది సమ్మెచేస్తే అటువైపు కూడా రాలేదని విమర్శించారు. నల్ల బ్యాడ్జిలతో నిరసన తెలుపుతున్న ఉద్యోగులకు తమ మద్దతు ఉంటుందని చెప్పారు. సీఎం కేసీఆర్‌తో ఉద్యోగ సంఘాలది పేగు బంధమని, అన్నదమ్ముల బంధమని పార్టీ నాయకువు సుబ్బారావు అన్నారు.

## చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలి : బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్ గౌడ్

హైదరాబాద్, అక్టోబర్ 31:చేనేత ఉత్పత్తులపై జీఎస్టీని ఎత్తివేయాలని బీసీ కమిషన్ సభ్యుడు కిశోర్ గౌడ్ కేంద్రాన్ని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీఎస్టీలో చేనేత ఉత్పత్తులపై 5శాతం పన్ను విధించడాన్ని తీవ్రంగా తప్పుపడుతూ.. తెలంగాణ చేనేత, జౌళీశాఖ మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు అంబర్‌పేటలోని పోస్టాఫీస్ వద్ద చేనేత ఉత్పత్తిదారులు, యువకులతో కలిసి ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి కిశోర్ పోస్టుకార్డులు రాశారు.

తరతరాలుగా చేతివృత్తులు, కులవృత్తులు చేసుకుంటూ జీవనాన్ని కొనసాగిస్తున్న వారికి అండగా నిలబడి ఆదరించాలన్నారు. రాయితీలు, సబ్సిడీలు ఇచ్చి ప్రోత్సహించాల్సింది పోయి.. మోదీ ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై 5శాతం జీఎస్టీ విధించడం బాధాకరమన్నారు. వెంటనే జీఎస్టీని ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. జీఎస్టీని రద్దు చేసే వరకు వివిధ రూపాల్లో నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో జీవన్, ప్రభాకర్, నిరంజన్, అశోక్, ఉమేశ్, రాజు, రమేశ్, భూమేశ్, వెంకటేశ్, కృష్ణ, రాజేష్, అంజి, చిన్ని తదితరులు పాల్గొన్నారు.



కం॥ లావుగ క్రికెటు నందున
దీవెనలను గాన్న దివ్య తేజోమయుడై
వివియస్ లక్ష్మణునకు
కావించెద నతి శతమును కళ్యాణ్ణీ నిగడ్ !!

(నవంబర్ 1 వీ.వీ.ఎస్. లక్ష్మణ్ జననం...)

–రాధశ్రీ
సెల్:9494481210



## చేనేతపై జీఎస్టీని రద్దు చేయండి.. లక్షలాది పోస్ట్ కార్డులను మోదీకి పంపిన నేతన్నలు




హైదరాబాద్, అక్టోబర్ 31:చేనేతపై జీఎస్టీని పూర్తిగా రద్దు చేయాలంటూ రాష్ట్రవ్యాప్తంగా నేతన్నలు ప్రధాని మోదీకి రాసిన లక్షలాది ఉత్తరాలను ఈరోజు హైదరాబాదులో ప్రధానమంత్రి కార్యాలయానికి పోస్ట్ చేయడం జరిగింది. తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి వచ్చిన లక్షలాది ఉత్తరాల సంచులతో నేతన్నల సంక్షేమ సంఘాలు, చేనేత కార్మిక సంఘాలు మరియు నేతన్నల సామాజిక వర్గాలు, పార్టీ లీడర్లు హైదరాబాద్ లోని నిజాం కాలేజీ గ్రౌండ్ లో భారీగా ప్రదర్శించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన వందలాది నేతన్నలు నిజాం కాలేజ్ నుంచి ఉత్తరాలను తీసుకొని అబిడ్స్ లోని జనరల్ పోస్ట్ ఆఫీస్ వరకు భారీగా ఒక ర్యాలీని నిర్వహించారు.

అంతకుముందు నిజాం కాలేజ్ గ్రౌండ్ లో ఏర్పాటు చేసిన వేదిక వద్ద లక్షలాది ఉత్తరాలను ప్రదర్శిస్తూ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. చేనేత కార్మికులకు సంబంధించిన భవిష్యత్తును అగమ్యగోచరం చేస్తున్న చేనేత వస్త్రాల జీఎస్టీని పైన పూర్తిగా తొలగించాలని డిమాండ్ చేశారు. దీంతోపాటు నేతన్నల సంక్షేమానికి గతంలో ఉన్న జీవిత బీమా మరియు యార్న్ సబ్సిడీ వంటి కార్యక్రమాలను పునరుద్ధరించాలని, రద్దు పరిచిన హ్యాండ్లూమ్ మరియు పవర్ లూమ్ వంటి బోర్డులను వెంటనే తిరిగి ఏర్పాటు చేయాలని నినదించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎల్ రమణ మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం చేనేత కార్మికుల పట్ల అత్యంత క్రూరంగా వ్యవహరిస్తున్నదని, వారికి ఉన్న అన్ని సంక్షేమ కార్యక్రమాలను రద్దు చేసి, వారిని చేనేత వృత్తి నుంచి దూరం చేస్తున్నదని ఎల్ రమణ ఆరోపించారు. ఒకప్పుడు గాంధీ మహాత్ముడు దేశ స్వాతంత్రం కోసం అత్యంత కీలకమైన ఆయుధంగా వాడిన చేనేత ఉత్పత్తులపైన చరిత్రలో ఎన్నడూ లేని విధంగా జీఎస్టీ విధించడం అత్యంత దారుణం అన్నారు. పైగా ఐదు శాతం ఉన్న జీఎస్టీని చేనేత వస్త్రాలపై 12 శాతానికి పెంచేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కుట్ర చేసిందని, దేశవ్యాప్తంగా వచ్చిన నిరసనల వలన ప్రస్తుతం దాన్ని ఆపి ఉంచిందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేనేతపైన ఉన్న ఐదు శాతం జీఎస్టీని పూర్తిగా ఎత్తివేయాలన్న ఏకైక నినాదంతో తెలంగాణ రాష్ట్రంలోని నేతన్నలు లక్షలాది పోస్ట్ కార్డులను ప్రధానమంత్రికి రాశారని, ఇప్పటికైనా దేశవ్యాప్తంగా ఉన్న నేతన్నల ఆకాంక్షలను దృష్టిలో ఉంచుకొని కేంద్రం చేనేతపైన జిఎస్టిని పూర్తిగా రద్దు చేయాలని, అప్పటిదాకా తమ నిరసన కార్యక్రమాలను కొనసాగిస్తామని ఎల్ రమణ తెలిపారు.

లక్షలాది పోస్ట్ కార్డులను ప్రధానమంత్రి మోడీకి పంపించడం ద్వారా చేనేత కార్మికులు తమ దుఃఖాన్ని, బాధను ప్రధానమంత్రి కి తెలియజేసే ప్రయత్నాన్ని చేశారని, ఈ పోస్ట్ కార్డులను అందుకున్న తర్వాత ఆయినా ప్రధానమంత్రి వెంటనే స్పందించి చేనేత పైన జిఎస్టిని పూర్తిగా రద్దు చేయాలని మాజీ రాజ్యసభ సభ్యులు రాపోలు ఆనంద్ భాస్కర్ డిమాండ్ చేశారు.

నిజాం కాలేజీ నుంచి అబిడ్స్ జనరల్ పోస్ట్ ఆఫీస్ వరకు ర్యాలీగా వెళ్లిన నాయకులు నేతన్నలు, తమ వెంట తీసుకువచ్చిన లక్షలాది ఉత్తరాలను ప్రధానమంత్రికి పోస్ట్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర చేనేత కార్పొరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్, పవర్లూమ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరి ప్రవీణ్, వరంగల్ మేయర్ గుండు సుధారాణి, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత కర్నాటి విద్యాసాగర్, వివిధ పద్మశాలి సంఘాల ప్రతినిధులు, రాష్ట్రంలోని చేనేత కార్మికుల సొసైటీలు, వాటి ప్రతినిధులు భారీ ఎత్తున తరలివచ్చిన వివిధ జిల్లాల నేతన్నలు పాల్గొన్నారు.

## కార్తిక సోమవారం.. శివాలయాలకు పోటెత్తిన భక్తులు



హైదరాబాద్, అక్టోబర్ 31:కార్తిక మాసం మొదటి సోమవారం సందర్భంగా రాష్ట్రంలోని శైవ క్షేత్రాలకు భక్తులు పోటెత్తారు. ఓం నమశ్శివాయ అనే పంచాక్షరి మంత్రంతో ఆలయాలు మారుమోగుతున్నాయి. ఆలయ అర్చకులు శివునికి ప్రత్యేకమైన రుద్రాభిషేకాలు, మహా రుద్రాభిషేకాలు, బిల్వార్చనలను నిర్వహిస్తున్నారు. పంచామృతాలతో స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. భక్తులు పెద్దఎత్తున కార్తిక దీపాలు వెలిగిస్తున్నారు. రాష్ట్రంలో ప్రముఖ శైవక్షేత్రం వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. ఆలయ ఆవరణలో దీపాలు వెలించారు. స్వామివారి దర్శనం కోసం భారీసంఖ్యలో క్యూలైన్లలో వేచిఉన్నారు. ఇక భద్రాచలం వద్ద గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి.. కార్తిక దీపాలను నదిలో వదులుతున్నారు. హైదరాబాద్‌లోని శైవక్షేత్రాలు భక్తులతో నిండిపోయాయి. కార్తిక దీపాలు వెలిగించిన భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు.

## తెలంగాణకు మరో రూ. 600 కోట్ల భారీ పెట్టుబడి



హైదరాబాద్, అక్టోబర్ 31: తెలంగాణకు పెట్టుబడుల ప్రవాహం కొనసాగుతూనే ఉంది. తాజాగా మరో భారీ పెట్టుబడి వచ్చింది. అట్టారో ఇండియా కంపెనీ తెలంగాణలో భారీ పెట్టుబడి పెట్టేందుకు ముందుకు వచ్చింది. ఈ విషయాన్ని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖల మంత్రి కేటీఆర్ ట్విట్టర్ వేదికగా ప్రకటించారు. అట్టారో ఇండియా కంపెనీ తెలంగాణలో రూ. 600 కోట్ల భారీ పెట్టుబడి పెట్టబోతోందని, ఈ విషయాన్ని ప్రకటించేందుకు సంతోషిస్తున్నానని కేటీఆర్ తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ పెట్టుబడి ద్వారా 300 మందికి పైగా ప్రత్యక్ష ఉపాధి లభించనుంది. పరోక్షంగా చాలా మంది ఉపాధి లభించనుందని తెలిపారు.

# సువిశాల భారత నిర్మాత సర్దార్ పటేల్

## (31 అక్టోబర్ సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదినం సందర్భంగా)

సువిశాల భారతానికి పునాదులు వేసిన స్వాతంత్ర్య సమరయోధుడు, నికార్సైన రాజకీయ నాయకుడు, న్యాయవాది, బర్దోలీ పోరాట యోధుడు, స్వతంత్ర భారత తొలి ఉప ప్రధాని, హోంశాఖామంత్రి సర్దార్ వల్లభాయ్ జవేరీభాయ్ పటేల్ 31 అక్టోబర్ 1875న నాడియాడ్ గ్రామంలో సాధారణ రైతు కుటుంబంలో లడ్బా పటేల్, జవేర్‌భాయ్ పటేల్ దంపతులకు జన్మించారు. స్థానిక పాఠశాలలో ప్రాథమిక విద్యను ప్రారంభించి, జిల్లా ప్లీడర్ పరీక్షలో నెగ్గి గోద్రాలో న్యాయవాదిగా పని చేసిన పిదప ఇంగ్లాండ్ వెళ్లి బారిస్టరు పట్టాను పొందారు. అనంతరం 1913లో అహ్మదాబాదులో న్యాయవాద వృత్తి చేపట్టారు. తన 16వ ఏట వివాహం చేసుకొని ఒక కుమారుడు, ఒక కుమార్తెకు జన్మనిచ్చారు. 1908లో భార్య అకాల మరణం తరువాత పిల్లల వృద్ధికి కృషి చేస్తూనే స్వాతంత్ర్య ఉద్యమాల్లో, సామాజిక అనాచారాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేశారు. 1917-24ల మధ్య మునిసిపల్ కమిషనర్‌గా, 1924?28 మధ్య మునిసిపల్ ప్రెసిడెంట్‌గా ఎన్నికైనారు. గాంధీ నేతృత్వంలో సాగుతున్న జాతీయోద్యమానికి ఆకర్షితుడైన పటేల్ సహాయనిరాకరణోద్యమంలో పాల్గొనడంతో పాటు బర్దోలీ కిసాన్ ఉద్యమం(1928), విదేశీ వస్తు బహిష్కరణ/దహనం, ఉప్పు సత్యాగ్రహం(1930), క్విట్ ఇండియా(1942), మద్యనిషేధం, అస్పృశ్యత నివారణ, కులవివక్షను వ్యతిరేకించడం లాంటి ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని 'సర్దార్(నాయకుడు)' అనే ప్రజా బిరుదును పొందారు. స్వాతంత్ర్య పోరాటంలో భాగంగా 1932-34, 1940-41, 1942-45ల మధ్య పలు దఫాలుగా జైలు పాలైయ్యారు. భారత జాతీయ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మెజారిటీ సభ్యుల మద్దత్తు ఉన్నప్పటికీ గాంధీ సూచనతో తప్పుకొని నెహ్రూకు అప్పగించారు. ప్రజాస్వామ్యయుతంగా ప్రధానమంత్రి పదవి చేపట్టవలసిన సర్దార్ పటేల్ గాంధీ కోరికమేరకు ఉప ప్రధానిగా సేవలందించవలసి వచ్చింది. ఆ సమయంలో మెజారిటీ సభ్యుల మద్దత్తుతో తొలి ప్రధానిగా పటేల్ ఎంపికై ఉన్నట్లయితే నేడు సువిశాల భారత దేశ పరిస్థితి మరోలా ఉండేదని అభిప్రాయపడే వారు అనేకులు ఉండడం విశేషం.

హైదరాబాదు విముక్తిలో పటేల్ పాత్ర:

దేశం స్వాతంత్ర్యం పొందిన ఆనంద సమయాన దేశ విభజన గాయాలు ఉప్పెనలా ఉబికిన గడియల్లో దేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంశాఖ మంత్రిగా నాడు దేశవ్యాప్తంగా విస్తరించి ఉన్న 565 సంస్థానాలను భారత్‌లో విలీనం చేయడంలో ప్రధానపాత్రను నిర్వహించి సువిశాల భారతికి ఎనలేని సేవలు అందించారు. నాటి 565 సంస్థానాల్లో కశ్మీర్, హైదరాబాదు, జునాఘడ్ మినహా మిగిలినవన్నీ పటేల్ కృషితో బేషరతుగా భారతంలో అంతర్భాగం అయ్యాయి. ఈ మూడు పెద్ద సంస్థానాలను భారతంలో విలీనం చేయడానికి సర్దార్ పటేల్ తీసుకున్న సాహసోపేతమైన చర్యలు ప్రశంసనీయం. 'భారత నడిబొడ్డున క్యాన్సర్ పుండు(క్యాన్సర్ ఇన్ ది బెల్లీ ఆఫ్ ఇండియా)'లా హైదరాబాదు సంస్థానం దేశానికి ప్రమాదకరమని భావించారు మన సర్దార్ పటేల్. నాటి హైదరాబాదు (80,000 ఘనపు మైల్స్) సంస్థానంలో 85 శాతం హిందువులు, 15 శాతం ముస్లిమ్‌లు ఇతర మతస్థులు ఉండగా, నిజామ్ ఆర్మీలో 90 శాతం ముస్లింలు ఉండేవారు. హైదరాబాదు రైల్వే స్టేషన్‌లో 'ముస్లిమ్ టీ రూం', 'హిందూ టీ రూం'ల రూపంలో మత వివక్షతో వేరు వేరుగా ఉండేవి. ప్రపంచంలోనే అత్యంత ధనవంతుడైన 7వ నిజాం మీర్ ఉస్మాన్ అలా ఖాన్ కబంధ హస్తాల్లో నలుగుతున్న హైదరాబాదు సంస్థానాన్ని ముస్లిమ్ రాజ్యంగా మార్చడానికి ప్రయత్నాలు చేశారు. హైదరాబాదు సంస్థానానికి తనదైన ప్రత్యేక కరెన్సీ, రైల్వే, సైనిక బలగాలు ఉండేవి. పటేల్ కోరినట్లు కాకుండా నాటి నిజామ్ భారత్‌లో హైదరాబాదు విలీనాన్ని వ్యతిరేకించి స్వతంత్ర దేశంగా ఉండటానికి లేదా పాకిస్థాన్‌లో విలీనానికి దురాచనలు చేశారు. దీనికి తోడుగా ఓ వైపు రాక్షస రజాకార్లు (నిజాం పోలీస్ దళం) మతకల్లోలాలు సృష్టించడం, మరో వైపు భూస్వాముల అరాచకాలతో ప్రజల మానప్రాణాలు గాల్లో దీపాలు అయ్యాయి. రజాకార్లకు, భూస్వాములకు వ్యతిరేకంగా సాయుధ రైతాంగ పోరాటాలు ఉవ్వెత్తున ఎగిశాయి. క్రూర ఖాసీం రజ్వీ నాయకత్వంలోని రాక్షస రజాకార్లు హిందూ మహిళలను మానభంగం చేయడం, దోపిడీలు, హింసలు విచ్చలవిడిగా చేశారు. నిజామ్ తలవంచడానికి, హైదరాబాదు విమోచనకు 13 సెప్టెంబర్ 1947న 'ఆపరేషన్ పోలో' పేరుతో సైనిక చర్య ప్రారంభమై 108 గంటల పాటు కొనసాగి 17 అక్టోబర్ 1947న ముగిసింది. సైనిక చర్యను వ్యతిరేకించిన నాటి ప్రధాని నెహ్రూ అభిప్రాయాలను పక్కనపెట్టి సర్దార్ పటేల్ హైదరాబాదు విముక్తిలో విజేతగా నిలిచారు. నిజాం రాక్షస పాలన అంతమైంది. నాటి హిందూ ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ప్రజలంతా ఏకతాటి మీద నిలిస్తే ఏ ప్రభుత్వం ఏమీ చేయలేదని నమ్మే దేశ సమైక్యతగా మూర్తి పటేట్ తీసుకున్న చొరవ అనన్యసామాన్యం, అనితరసాధ్యం.

భారత రత్న, సమైక్యతగా మూర్తి:

భారత రాజ్యాంగ రచనకు ఏర్పడిన కమిటీలో ముఖ్య సభ్యుడు, ప్రాథమిక హక్కుల కమిటీ చైర్మన్, 1931 కరాచీ జాతీయ కాంగ్రెస్ సదస్సుకు అధ్యక్షుడిగా అమూల్య సేవలు అందించారు. నెహ్రూ మంత్రివర్గంలో దేశ తొలి ఉప ప్రధానమంత్రి, హోంమంత్రిగా 40 మాసాలు (1947-1950) మాత్రమే సేవలందించి 15 డిసెంబర్ 1950న గుండె పోటుతో తుది శ్వాస విడిచారు. దేశ సమస్యలకు తనదైన రీతిలో పరిష్కారాలు అందించిన పటేల్ సేవలను గుర్తించి భారత ప్రభుత్వం 1991లో 'భారత రత్న' బిరుదును మరణానంతరం ప్రదానం చేసింది. 'ఉక్కు మనిషి(ఐరన్ మ్యాన్ ఆఫ్ ఇండియా)'గా పేరొందిన సర్దార్ పటేల్‌కు 'జాతీయ సమైక్య సాధకుడు(యూనిఫైయర్ ఆఫ్ ది నేషన్)'గా కూడా పేరుంది. 21 ఏప్రిల్ 1947న సివిల్ సర్వెంట్లను ఉద్దేశించి తొలిసారి పటేల్ మాట్లాడిన శుభ సందర్భానికి గుర్తుగా ప్రతి ఏట 21 ఏప్రిల్‌న 'నేషనల్ సివిల్ సర్వీసెస్ డే'ను పాటించుట ఆనవాయితీగా మారింది. పటేల్ జన్మదినం సందర్భంగా 2014 నుంచి ప్రతి ఏట 'నేషనల్ యునిటీ డేట్'ను పాటిస్తున్నాం. సర్దార్ పటేల్ సేవలకు సరైన గుర్తింపుగా ప్రభుత్వం ప్రపంచంలోనే అతి పొడవైన (182 మీటర్స్) విగ్రహాన్ని 'సమైక్య విగ్రహం (స్టాచ్యూ ఆఫ్ యునిటీ)' పేరుతో నిర్మించి 31 అక్టోబర్ 2018న జాతికి అంకితం చేశారు.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## కేరళలో కూలిన నిర్మాణంలో ఉన్న అండర్ పాస్ వంతెన, తప్పిన ప్రాణనష్టం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:కేరళలో, 66వ నంబర్ జాతీయ రహదారిలోని చెంగాల-నీలేశ్వరం సెక్షన్‌లో నిర్మాణంలో ఉన్న వాహన అండర్ పాస్ (వీయూపీ) డెక్ స్లాబ్ కూలిపోయింది. 29 అక్టోబర్ 2022 (శనివారం) తెల్లవారుజామున 3.30 గంటలకు ఈ సంఘటన జరిగింది. వాహన అండర్‌పాస్ డెక్ స్లాబ్ నిర్మాణం కోసం కాంక్రీట్ పనులు జరుగుతుండగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఒకరికి స్వల్ప గాయాలయ్యాయి, ప్రాణనష్టం లేదు.

కాంక్రీట్ పనులు చేయడానికి నిర్మించిన పరంజా విఫలం కావడంతో స్లాబ్ కూలిపోయిందని ప్రాథమికంగా తేల్చారు. ప్రమాద పూర్తి కారణాలను నిర్ధరించడానికి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ సూరత్‌కల్, కాలికట్ ఆచార్యులతో ఒక నిపుణుల కమిటీని జాతీయ రహదారుల అథారిటీ (ఎన్‌హెచ్‌ఏఐ) నియమించింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు చర్యలు, సంస్కరణలను ఈ కమిటీ సూచించనుంది.

నిర్మాణ పనుల్లో అత్యున్నత ప్రమాణాలను పాటించేందుకు జాతీయ రహదారుల అథారిటీ కట్టుబడి ఉంది. హైవేల అభివృద్ధిలో లోపాలు జరక్కుండా జాతీయ రహదారుల అథారిటీ ఒక కఠినమైన విధానాన్ని అనుసరిస్తోంది. నిర్మాణాలు చేపడుతున్న కాంట్రాక్టర్లు/కన్సల్టెంట్లు, సంస్థల వల్ల వంతెనలు/నిర్మాణాలు/నిర్మాణానికి సంబంధించిన విధానాల్లో ఏవైనా లోపాలు జరిగితే బాధ్యులైన సంస్థ/సిబ్బందిపై జరిమానా చర్యలు తీసుకుంటుంది.

## నగరంలో ముమ్మరంగా పోలీసుల తనిఖీ.. జూబ్లీహిల్స్ లో రూ.89.92 లక్షల నగదు స్వాధీనం

నల్లగొండ, అక్టోబర్ 31: మునుగోడు ఉప ఎన్నిక పోలింగ్ తేదీ సమీపిస్తున్న నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. మునుగోడుతోపాటు నగరంలో కూడా పోలీసులు సోదాలు నిర్వహిస్తున్నారు. మునుగోడు వైపు వెళ్లే వాహనాలను టోల్ ప్లాజాల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఇట్టికే పోలీసులు భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారు. తాజాగా మరోసారి హైదరాబాద్‌లో భారీగా డబ్బును పోలీసులు పట్టుకున్నారు. డబ్బును తరలిస్తున్నారనే సమాచారంతో వెస్ట్‌జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు నగరంలోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 71లో వాహనాలను తనిఖీ చేస్తుండగా ఓ కారులో రూ.89.92 లక్షల నగదును గుర్తించారు. అయితే ఆ మొత్తానికి సంబంధించి సరైన పత్రాలు చూపించకపోవడంతో దానిని స్వాధీనం చేసుకున్నారు. డబ్బు తరలిస్తున్న వ్యక్తిని విచారణ నిమిత్తం జూబ్లీహిల్స్ పోలీసులకు అప్పగించారు. ఇదిలా ఉండగా గత కొంతకాలంగా నగరంలో పోలీసుల తనిఖీల్లో నిర్వహిస్తుండగా.. పంజాగుట్టలో రూ.70 లక్షలు, బేగంబజారులో రూ.48.50 లక్షలు, నగర శివార్లలో మరో రూ.45 లక్షలు పట్టుబడ్డాయి. నగరంలో మొత్తం రూ.20 నుంచి 26 కోట్ల మేర అక్రమంగా తరలిస్తున్న నగదు పట్టుబడం గమనార్హం.

## బెంగళూరులో 2 నవంబర్ వరకు మూడు రోజుల జాతీయ ఇఎంఆర్ఎస్ సాంస్కృతిక వేడుకను నిర్వహిస్తున్న ఎన్ఇఎస్ టిఎస్

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ కింద పని చేస్తున్న స్వయంప్రతిపత్తి సంస్థ ది నేషనల్ ఎడ్యుకేషన్ సొసైటీ ఫర్ ట్రైబల్ స్టూడెంట్స్ (గిరిజన విద్యార్థులకు జాతీయ విద్యా సంస్థ) 31 అక్టోబర్ నుంచి 2 నవంబరు 2022 వరకు కర్నాటకలోని బెంగళూరులో జాతీయ ఇఎంఆర్ఎస్ కల్చరల్ ఫెస్ట్ ను ప్రారంభించేందుకు సంసిద్ధమవుతోంది.

ఈ కార్యక్రమాన్ని కర్నాటక రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూషన్స్ సొసైటీ (కెఆర్ఇఐఎస్) ఆర్ట్ ఆఫ్ లివింగ్ అంతర్జాతీయ కేంద్రంలో ఏర్పాటు చేస్తోంది. ఈ కార్యక్రమానికి గిరిజన వ్యవహారాల శాఖ సహాయ మంత్రి శ్రీమతి రేణుకా సింగ్ హాజరుకానున్నారు.

మూడు రోజులు జరగనున్న ఈ సాంస్కృతిక కార్యక్రమంలో దేశం నలుమూలలో ఉన్న ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎంఆర్ఎస్)కు చెందిన 1500+ విద్యార్థులు పాలుపంచుకోనున్నారు.

గిరిజనులను జనజీవన స్రవంతిలో ఏకీకరించి, వివిధ క్షేత్రాలలో అభివృద్ధి చెందేందుకు, సమాన అవకాశాలను అందిపుచ్చుకునేందుకు మంత్రిత్వ శాఖ ఇఎంఆర్ఎస్ సాంస్కృతిక వేడుకలను, క్రీడా కార్యక్రమాలను ప్రతి ఏడాదీ నిర్వహిస్తోంది. తద్వారా వివిధ రంగాలలో గిరిజన విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను ప్రదర్శించేందుకు ఒక జాతీయ వేదికను అందిస్తోంది. కోవిడ్ కారణంగా గత రెండళ్ళుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించకపోవడం వల్ల ఈ మూడు రోజుల వేడుక అత్యంత ప్రాముఖ్యతను సంతరించుకుంది. ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్ స్ఫూర్తికి అనుగుణంగా ఇఎంఆర్ఎస్‌లో విద్యను అభ్యసిస్తున్న గిరిజన విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి ఈ కార్యక్రమం ప్రేరణనివ్వడమే కాక నిరంతర సాంస్కృతిక అనుసంధానాన్ని ప్రోత్సహించి, జాతీయ సమైక్యత ద్వారా భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధిస్తుంది.

దేశవ్యాప్తంగా ఉన్న భారతీయ గిరిజనులు (షెడ్యూల్డు తెగల)కోసం భారత ప్రభుత్వం చేపట్టిన మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల పథకమే ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్ (ఇఎంఆర్ఎస్). భారత గిరిజన వ్యవహారాల మంత్రిత్వ శాఖ ప్రతిష్ఠాత్మక చొరవ ఇది. మారుమూల ప్రాంతాలలోని గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు 1997-98లో దీనిని ప్రవేశపెట్టారు.

## ఇంటర్నేషనల్ పెట్రోలియం ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్ ప్రారంభించడానికి యుఎఇ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:భారత పెట్రోలియం, సహజవాయువు , గృహ నిర్మాణ, పట్టణ వ్యవహారాల శాఖల మంత్రి శ్రీ హర్దీప్ ఎస్. పూరి

యుఎఇ ఎనర్జీ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ మంత్రి హెచ్.ఇ. సుహైల్ మొహమ్మద్ ఫరాజ్ అల్ మజ్రూయీ , పరిశ్రమ అధునాతన సాంకేతిక పరిజ్ఞాన శాఖ మంత్రి డాక్టర్ సుల్తాన్ అహ్మద్ అల్ జాబెర్ , అబుదాబి నేషనల్ ఆయిల్ కంపెనీ (ఎడిఎన్ఒసి) మేనేజింగ్ డైరెక్టర్, గ్రూప్ సిఈఓల ఆహ్వానం మేరకు.

అబుదాబి ఇంటర్నేషనల్ పెట్రోలియం ఎగ్జిబిషన్ అండ్ కాన్ఫరెన్స్ (ఎడిఐపిఇసి -2022) ప్రారంభోత్సవానికి హాజరు కావడానికి 2022 అక్టోబర్ 31 నుండి యుఎఇని సందర్శిస్తారు.

ఈ పర్యటనలో భాగంగా, యుఎఇ పరిశ్రమలు, అధునాతన సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ సుల్తాన్ అహ్మద్ అల్ జబెర్, ఎనర్జీ అండ్‌ఇన్ఫ్రాస్ట్రక్చర్ మంత్రి హెచ్.ఇ. సుహైల్ మొహమ్మద్ ఫరాజ్ అల్ మజ్రూయీ , ఎడిఎన్ఒసి ఎండి అండ్ గ్రూప్ సిఇఒ , ఇంకా కొందరు ఎంపిక చేసిన ఇతర మంత్రులు: అబ్దుల్ అజీజ్ బిన్ సల్మాన్ అల్ సౌద్ - సౌదీ అరేబియా ఇంధన శాఖ మంత్రి. హైథమ్ అల్ ఘైస్ - సెక్రటరీ జనరల్ ఒపెక్, తారెక్ ఎల్ మొల్లా - ఈజిప్ట్ పెట్రోలియం మరియు ఖనిజ వనరుల మంత్రి తో కలసి శ్రీ హర్దీప్ ఎస్. పూరి ఎడిఐపిఇసి-2022 ప్రారంభోత్సవ కార్యక్రమం లో ప్రసంగిస్తారు.

భారత్ - యుఎఇ వ్యూహాత్మక భాగ స్వామ్య మొత్తం పరిధిలో ఇంధన సహకారాన్ని బలోపేతం చేయడం పై యుఎఇ ఇంధన, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి మంత్రి సుహైల్ మొహమ్మద్ ఫరజ్ అల్ మజ్రూయి, యు ఎ ఇపారిశ్రామిక, అత్యాధునిక సాంకేతిక శాఖ మంత్రి డాక్టర్ సుల్తాన్ అహ్మద్ అల్ జబెర్, ఎడిఎన్ఒసి ఎండి అండ్ గ్రూప్ సిఈవో లతో శ్రీ హర్దీప్ ఎస్. పూరి ద్వైపాక్షిక చర్చలు జరుపుతారు.

ఎడిపెక్-2022 కార్యక్రమానికి హాజరయ్యే వివిధ దేశాలకు చెందిన తన సహచరులు, అంతర్జాతీయ ఇంధన సంస్థల అధిపతులు, గ్లోబల్ ఆయిల్ అండ్ గ్యాస్ కంపెనీల సీఈఓలతో మంత్రి సమావేశాలు నిర్వహించనున్నారు.

ఈ కార్యక్రమంలో భాగంగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ పెట్రోలియం ఇండస్ట్రీ (ఎఫ్ ఐపిఐ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సిఐఐ) సంయుక్తంగా ఏర్పాటు చేసే ఇండియా పెవిలియన్ ను కూడా మంత్రి ప్రారంభిస్తారు.

ఎడిఎన్ఒసి ఆధ్వర్యం లో జరిగే ఎడిఐపిఇసి ఇంధన రంగానికి సంబంధించిన ప్రముఖ ఈవెంట్లలో ఒకటి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, ఇంధన సరఫరా , భద్రతా సవాళ్లు, అలాగే తదుపరి తరం ఇంధన పరిష్కారాలతో సహా అభివృద్ధి చెందుతున్న ప్రపంచ ఇంధన వ్యవస్థను ప్రభావితం చేసే తాజా పోకడలపై అంతర్దృష్టులను అందించాలని ఎడిఎన్ఒసి లక్ష్యంగా పెట్టుకుంది.

## నాగ్ పూర్ నుంచి పూణెకు ఎనిమిది గంటల్లో ప్రయాణించడం సాధ్యమవుతుందన్న శ్రీ నితిన్ గడ్కరీ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ఇకపై నాగ్ పూర్ నుంచి పూణె ప్రయాణం ఎనిమిది గంటలు పడుతుందని కేంద్ర రోడ్డు రవాణా, హైవేల మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ పేర్కొన్నారు. ప్రస్తుతం నాగ్ పూర్ నుంచి పూణెకు ప్రయాణిస్తున్న ప్రయాణికులకు కలుగుతున్న అసౌకర్యాన్ని పరిగణనలోకి తీసుకుని, నాగ్ పూర్- ముంబై సమృద్ధి మహామార్గ్ ను ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్) సమీపంలో నూతనంగా ప్రతిపాదించిన పూణె- ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్) ఆక్సెస్ కంట్రోల్ గ్రీన్ ఎక్స్ ప్రెస్ వే తో అనుసంధానం చేస్తున్నట్టు తెలిపారు. ఈ రహదారిని జాతీయ రహదారి అథారిటీ ఆఫ్ ఇండియా పూర్తి సమలేఖనంతో నిర్మిస్తుందని తెలిపారు.

దీనితో సమృద్ధి మహామార్గ్ ద్వారా పూణె నుంచి ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్)కు రెండు గంటల్లో, నాగ్ పూర్ నుంచి ఛత్రపతి శంభాజీనగర్ (ఔరంగాబాద్)కు ఐదున్నర గంటల్లో ప్రయాణించడం సాధ్యమవుతుందని శ్రీ గడ్కరీ వివరించారు.

## ఆర్ఎస్ఎస్ కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తాం : రాహుల్ గాంధీ

హైదరాబాద్, అక్టోబర్ 31:ఆర్ఎస్ఎస్ కబంధ హస్తాల నుంచి దేశాన్ని విముక్తి చేస్తామని ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు. రంగారెడ్డి జిల్లా తిమ్మాపూర్‌లో ఏర్పాటు చేసిన సభలో రాహుల్ మాట్లాడుతూ.. ప్రధాని మోదీ అన్ని వ్యవస్థలను నాశనం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే సమూల మార్పులు తీసుకొస్తామన్నారు. కేంద్రంలో బీజేపీ, తెలంగాణలో టీఆర్ఎస్ వల్ల కొద్దిమంది వ్యాపారవేత్తలకే లాభం చేకూరుతుందన్నారు. తెలంగాణలో కాంగ్రెస్ గెలుస్తుందని, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఫిట్‌నెస్‌కోసం జిమ్ చేస్తే సరిపోతుంది, కానీ పాదయాత్ర చేయాల్సిన పనిలేదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలను కేంద్రం నాశనం చేస్తోందన్నారు. రాజకీయం, ఎన్నికల కోసం యాత్ర చేయడం లేదు, దేశ మనుగడ కోసమే మా యాత్ర అన్నారు. తెలంగాణలో టీఆర్ఎస్ పొత్తు ఉండదన్నారు. విపక్షాల మధ్య ఐక్యత రావాలని తెలిపారు. పాదయాత్ర ద్వారా ఎన్నో తెలుసుకున్నానన్నారు. అనంతరం గుజరాత్‌లో ప్రమాదంపై రాహుల్‌గ్భ్రాంతి వ్యక్తం వేసి.. రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు.

## టీడీపీని ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు : మంత్రి జయరాం



అమరావతి: అక్టోబర్ 31: లో లెవెల్ కాల్వకు తుంగభద్ర జలాశయం నుండి నవంబర్ ఒకటవ తేదీ నుండి సాగు, తాగు విడుదల చేయిస్తామని రాష్ట్ర కార్మిక ఉపాధి కల్పన శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం, బళ్ళారి రూరల్ ఎమ్మెల్యే నాగేంద్ర, ఆదోని ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి లో లెవెల్ కాలువ దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. ఈ సందర్భంగా వాళు సంయుక్తంగా మాట్లాడుతూ గత 15 రోజులుగా నో లెవెల్ కాలువలో నీటి ప్రవాహం ఆగిపోయిన సందర్భంగా రైతులు ఇబ్బంది పడకుండా ఉండేవిధంగా పనులు ముమ్మరంగా జరిపి తొలితగతన రైతులకు నీరు అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రధాన కాలువైన ఎల్ ఎల్ సి కర్ణాటక ఆంధ్ర సరిహద్దు ప్రాంతంలో వరి మిరప పత్తి ఇతర పంటలు కూడా సాగు చేశారు. ఆంధ్రరాష్ట్రం సరిహద్దు ప్రాంతమైన అనంతపూర్ తదితర ప్రాంతాల్లో భారీ వర్షాలు కురవడంతో హగరి (వేదవతి) నదిలో ఈ సంవత్సరం భారీ వరద ప్రభావం ప్రవహించింది. ఈ ప్రభావంతో మోక సరిహద్దు ఎల్ఎల్ సి 121 కిలోమీటర్ వద్ద అదిరినదిపై ప్రవహిస్తున్న ఎల్ఎల్సీ కాలువ పిల్లర్ కొట్టుకోపోవడంతో నీటి ప్రవాహాన్ని అధికారులు పూర్తిగా నిలిపివేశారు. ఇప్పటివరకు వేదవతి నదిలో నీటి ప్రవాహం తగ్గలేదు. తుంగభద్ర డ్యామ్ బోర్డు అధికారులు కాల్వ మరమ్మతులు పనులు పూర్తి చేశారని నవంబర్ ఒకటవ తేదీ నుండి సాగునీరు అందిస్తామని తుంగభద్ర బోర్డు చీఫ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఈ ఈ నీలకంఠ రెడ్డి రైతులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నియోజక ఇంచార్జి నారాయణస్వామి, వైఎస్ఆర్ పార్టీ నాయకులు, కార్యకర్తలు రైతులు, ఆంధ్ర కర్ణాటక రైతులు తదితరులు పాల్గొన్నారు.

అరసం కథా స్రవంతి
10 కథా సంపుటాల ఆవిష్కరణ



1. కనుపర్తి వరలక్ష్మమ్మ కథలు
2. తాళ్లూరు నాగేశ్వరరావు కథలు
3. శశిశ్రీ కథలు
4. శాంతి నారాయణ కథలు
5. పెద్దింటి అశోక్‌కుమార్ కథలు
6. బలివాడ కాంతారావు కథలు
7. సతీష్ చందర్ కథలు
8. కరుణకుమార కథలు
9. వి.ఆర్.రాసాని కథలు
10. సన్నపురెడ్డి వెంకటరామిరెడ్డి కథలు

పది పుస్తకాల సెట్ ధర రూ. 670/-
ఆవిష్కరణ సందర్భంగా సెట్ రూ. 550/- మాత్రమే

తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం మరియు
తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంయుక్త ఆధ్వర్యంలో

కథా స్రవంతి సంపుటాల ఆవిష్కరణ సభ

సభాధ్యక్షులు : డా॥ రాపోలు సుదర్శన్
ప్రధాన కార్యదర్శి, తెలంగాణ అరసం

ముఖ్య అతిథి & ఆవిష్కర్త : ఆచార్య ఎస్వీ సత్యనారాయణ
పూర్వ ఉపాధ్యక్షులు, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం

గౌరవ అతిథి : శ్రీ జూలూరు గౌరీశంకర్
అధ్యక్షులు, తెలంగాణ సాహిత్య అకాడమీ

విశిష్ట అతిథి : డా॥ ఏనుగు నరసింహారెడ్డి
అదనపు కలెక్టర్, మేడ్చల్ జిల్లా

ఆత్మీయ అతిథులు : డా॥ మామిడి హరికృష్ణ
సంచాలకులు, తెలంగాణ భాషా సాంస్కృతికశాఖ

పుస్తకాల పరిచయం : శ్రీ కె.పి.అశోక్ కుమార్, ప్రముఖ విమర్శకులు

ప్రత్యేక అతిథులు : శ్రీ సతీష్ చందర్, ప్రముఖ కవి, కథా రచయిత
శ్రీ పెద్దింటి అశోక్ కుమార్, ప్రముఖ కథా రచయిత

ప్రధాన సంపాదకులు : శ్రీ వల్లూరు శివప్రసాద్, ప్రధాన కార్యదర్శి, ఆం.ప్ర. అరసం

వేదిక : రవీంద్రభారతి (మినీహాలు, మొదటి అంతస్థు), హైదరాబాదు

తేది & సమయం : తేది: 5-11-2022, శనివారం, సా॥ 6 గం॥లకు

అందరూ ఆహ్వానితులే

డా॥ పల్లేరు వీరాస్వామి
కార్యనిర్వాహక కార్యదర్శి, తెలంగాణ అరసం
9441779688

# విజిలెన్స్ అవేర్‌నెస్ వీక్ 2022 ఫంక్షన్

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ఈ రోజు (అక్టోబర్ 31) న ప్రారంభమయ్యాయి. దివంగత సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి అయిన అక్టోబర్ 31 వ తేదీన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు ప్రారంభించింది. ఈ రోజు ప్రారంభమైన వారోత్సవాలు నవంబర్ 6 వరకు జరుగుతాయి.

అభివృద్ధి చెందిన దేశం కోసం అవినీతిరహిత భారతదేశం" నినాదంతో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ కార్యక్రమాలు నిర్వహిస్తుంది.

కమిషన్ సిబ్బందితో సమగ్రతా ప్రతిజ్ఞ చేయించి సెంట్రల్ విజిలెన్స్ కమిషనర్ శ్రీ సురేశ్ ఎన్ పటేల్, విజిలెన్స్ కమిషనర్ శ్రీ ప్రవీణ్ కుమార్ శ్రీవాస్తవ, విజిలెన్స్ కమిషనర్ శ్రీ అరవింద కుమార్ లు విజిలెన్స్ అవగాహన వారోత్సవాలను ప్రారంభించారు. సతర్కట భవన్‌లో ఉదయం 11 గంటలకు జరిగిన కార్యక్రమాన్నిప్రసార్ భారతి రికార్డు చేసింది.

విజిలెన్స్ అవగాహన వారోత్సవాలు 2022 నిర్వహణలో భాగంగా అన్ని మంత్రిత్వ శాఖలు/డిపార్ట్‌మెంట్‌లు/సంస్థలలో మూడు నెలల పాటు ప్రచారాన్ని నిర్వహించిన సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ అవినీతి అరికట్టేందుకు గల అవకాశాలపై అవగాహన కల్పిస్తూ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించింది. ఈ కింది ఆరు అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి కార్యక్రమాలు జరిగాయి.

విజిలెన్స్ వారోత్సవాల్లో భాగంగా నవంబర్ 3వ తేదీన విజ్ఞాన్ భవన్‌లో సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది. కార్యక్రమానికి ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ హాజరయ్యే అవకాశం వుంది.

# వల్లభాయ్ పటేల్ జీవితం ఆదర్శం



కరీంనగర్, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జీవితం నేటి, భావితరాలకు ఆదర్శమని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరెడ్డి అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఏక్తా దివస్ సందర్భంగా మున్సిపల్ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ సిబ్బందిచే ఐక్యతా ప్రతిజ్ఞ చేయించారు. ఈకార్యక్రమంలో మేనేజర్ శివప్రసాద్, ఎంఏఈ సతీష్, మనోహర్, అకౌంటెంట్ సంతోష్, జూనియర్ అసిస్టెంట్లు రమాకాంత్, సురేందర్, సానిటరీ ఇన్స్పెక్టర్లు సంధ్య కుమారి, రామ్మోహన్ రెడ్డి, పులిపాక రాజు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# నంబరు ప్లేట్లు లేని వాహనాలు సీజ్



కరీంనగర్, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): నంబరు ప్లేట్లు లేకుండా వాహనదారులు తమ వాహనాలు నడిపితే సీజ్ చేస్తామని పెద్దపల్లి ఏసీపీ సారంగపాణి పేర్కొన్నారు. సోమవారం సుల్తానాబాద్ పట్టణంలోని తెలంగాణ చౌరస్తా వద్ద పోలీస్ అధికారులు వాహనాల తనిఖీ చేపట్టారు. నంబరు ప్లేట్లు లేని వాహనాలను సీజ్ చేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ వాహనదారులు తమ వాహనాలకు ముందు, వెనక తప్పనిసరిగా నంబరు ప్లేట్లు అమర్చుకోవాలన్నారు. నంబరు ప్లేట్లు లేకుండా వాహనాలు నడపడం చట్టరీత్యా నెరమన్నారు. అలాంటి వాహనాలను గుర్తించి సీజ్ చేస్తున్నామన్నారు. రవాణా శాఖ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, లేకపోతే జరిమానాలు తప్పవన్నారు. పెద్దపల్లి సబ్ డివిజన్ పరిధిలో ప్రతినిత్యం వాహనాల తనిఖీతోపాటు బ్రీత్ అనలైజర్ ద్వారా తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష పడుతుందన్నారు. తనిఖీలలో సుల్తానాబాద్ సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్ఐ లు ఉపేందర్, వినితతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

# హైకోర్టు జడ్జిని కదిలించిన ఘటన.. చంటిబిడ్డకు చనుబాలిచ్చిన కానిస్టేబుల్ ఔదార్యం

కేరళ రాష్ట్రం కోజికోడ్ చెవాయూర్ పోలీస్ స్టేషన్ సివిల్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు ఎంఆర్ రమ్య, ఆమె కుటుంబ సభ్యులను పోలీసు ప్రధాన కార్యాలయానికి ఆహ్వానించి ప్రశంసా పత్రంతో సత్కరించారు పోలీసు డిపార్ట్‌మెంట్ చీఫ్ అనిల్ కాంత్. ఆకలితో అలమటిస్తున్న ఓ పసికందు పట్ల సానుభూతితో వ్యవహరించి, పోలీసు శాఖ ప్రతిష్టను పెంచిందని పోలీసు ఉన్నతాధికారి పొగడ్తలతో ముంచెత్తారు.

ఆమె సేవకు ముగ్ధుడై.. ఆకలితో అలమటిస్తున్న పసికందును సొంత తల్లిలా ఆదరించి చనుబాలు ఇచ్చినందుకు ఆమె చేసిన సహజత్వాన్ని చూసిన హైకోర్టు న్యాయమూర్తి దేవన్ రామచంద్రన్, ఆమె చేసిన పనిని మెచ్చుకుంటూ పోలీసు ఉన్నతాధికారులకు లేఖ కూడా రాశారు. ఆమెకు జడ్జి సర్టిఫికేట్‌ను కూడా పోలీసు చీఫ్ అందించారు. సర్టిఫికేట్‌లో ఆమె పోలీస్ ఫోర్స్ యొక్క బెస్ట్‌గా ఉందని పేర్కొన్నారు.

శనివారం ఉదయం 22 ఏళ్ల మహిళ తన బిడ్డ కనిపించడం లేదని చెవాయూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కుటుంబ కలహాల కారణంగా పసికందును తల్లి నుంచి భర్త తీసుకెళ్లాడు. పసికందుని తండ్రి తీసుకెళ్లి ఉండవచ్చనే సమాచారంతో వాయనాడ్ సరిహద్దులోని పోలీస్ స్టేషన్లకు సమాచారం అందించారు. సుల్తాన్ బతేరి పోలీసులు సరిహద్దు వెంబడి వాహనాలను తనిఖీ చేస్తుండగా శిశువుతో ప్రయాణిస్తున్న తండ్రిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు.

కాగా, ఆకలితో అలసిపోయిన నవజాత శిశువును పోలీసులు ఆసుపత్రికి తరలించారు. పసికందులో షుగర్ లెవల్స్ తక్కువగా ఉన్నాయని డాక్టర్లు గుర్తించారు. కాగా, కేసులో భాగంగా ఆసుపత్రికి చేరుకున్న రమ్య.. తాను పాలిచ్చే తల్లి అని డాక్టర్లకు తెలియజేసి పసిపాపకు చనుబాలు పట్టించారు. ఆ రోజు సాయంత్రమే శిశువుని తల్లికి అప్పజెప్పారు.

ఎంఆర్ రమ్య కోజికోడ్‌లోని చింగాపురం స్థానికురాలు. నాలుగేళ్ల క్రితం పోలీసు శాఖలో చేరింది. ఆమె మహిళా బెటాలియన్‌లోని రెండో బ్యాచ్‌లో శిక్షణ పూర్తి చేసి సాయుధ పోలీసు బెటాలియన్‌లోని నాలుగో స్క్వాడ్‌లో పనిచేసింది. ప్రసూతి సెలవు తర్వాత ఆమె చెవాయూర్ పోలీస్ స్టేషన్‌లో చేరారు. ఇద్దరు పిల్లల తల్లి అయిన రమ్య పాఠశాల ఉపాధ్యాయుడు అయిన అశ్వంత్ వైశ్వన్‌కు భార్య.



# కేవడియాలో జాతీయ సమైక్యతా దినోత్సవంలో పాల్గొన్న ప్రధానమంత్రి

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇవాళ జాతీయ సమైక్యతా దినోత్సవంలో భాగంగా సర్దార్ పటేల్ ఐక్యతా ప్రతిమవద్ద ఆయనకు నివాళి అర్పించి, సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ– నిన్న మోర్బీ దుర్ఘటన బాధితుల పట్ల ప్రధాని తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను కేవడియాలో ఉన్నప్పటికీ, తన హృదయంలో మోర్బీ ఉదంతం వేదన మిగిల్చిందని ఆయన అన్నారు. "ఒకవైపు నా మనసంతా దుఃఖంతో నిండిపోయింది.. మరోవైపు కర్తవ్యం, బాధ్యతలతో కూడిన మార్గం నన్ను ఇక్కడికి నడిపించింది. అందుకే జాతీయ సమైక్యతా దినోత్సవానికి నేను హాజరు కావాల్సి వచ్చింది'' అని ఆయన చెప్పారు.

నిన్నటి దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన వారందరికీ ప్రధానమంత్రి ప్రగాఢ సానుభూతి ప్రకటించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా నిలిచి, అన్నివిధాలా వారిని ఆదుకుంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సహాయ చర్యల్లో నిమగ్నం కాగా, కేంద్ర ప్రభుత్వం అవసరమైన చేయూతనిస్తున్నదని తెలిపారు. గాయపడిన వారికి చికిత్స చేస్తున్న ఆసుపత్రులకూ సహాయం అందిస్తున్నామని, సైన్యంతోపాటు వాయుసేన బృందాలు ఇతరత్రా సహాయ చర్యల్లో పాల్గొంటున్నాయని వివరించారు. మరోవైపు సహాయ చర్యలలో ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్లు ప్రధాని తెలిపారు. రక్షణ కార్యకలాపాల పర్యవేక్షణ కోసం గుజరాత్ ముఖ్యమంత్రి కూడా మోర్బీకి చేరుకున్నారని చెప్పారు. అంతేకాకుండా ఈ దుర్ఘటనపై దర్యాప్తు నిమిత్తం ఓ కమిటీని ఏర్పాటు చేశారని ఆయన వెల్లడించారు. రక్షణ–సహాయ కార్యకలాపాల్లో ఎలాంటి లోటుపాట్లు ఉండబోవని దేశ ప్రజలకు ప్రధాని హామీ ఇచ్చారు. కాగా, ఈ విషాద ఉదంతం నేపథ్యంలో ప్రస్తుత సమైక్యతా దినోత్సవాల సాంస్కృతిక కార్యక్రమాలు రద్దయ్యాయి.

ఈ ఏడాది సమైక్యతా దినోత్సవం ప్రాముఖ్యం గురించి ప్రధానమంత్రి నొక్కిచెప్పారు. ''ఇది మన స్వాతంత్ర్యానికి 75 వసంతాలు పూర్తయిన సంవత్సరం మాత్రమేగాక మనం సరికొత్త సంకల్పాలతో వాటిని నెరవేర్చే దిశగా పయనిస్తున్నాం" అని స్పష్టం చేశారు. కుటుంబమైనా, సమాజమైనా, దేశమైనా ప్రతి దశలోనూ సమైక్యత ఎంతో అవసరమని ప్రధాని అన్నారు. ఈ భావన దేశవ్యాప్తంగా 75,000 చోట్ల సమైక్యతా పరుగు రూపంలో అంతటా ప్రతిఫలిస్తుందని ఆయన అన్నారు. "సర్దార్ పటేల్ యొక్క దృఢ దీక్షనుంచి యావద్దేశం స్ఫూర్తి పొందుతోంది. దేశ సమైక్యత కోసం, 'పంచప్రాణ్' సూత్రాన్ని ఆచరణలో చూపడానికి ప్రతి పౌరుడు ప్రతినబూనారు" అని ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగం కొనసాగిస్తూ– "మన స్వాతంత్ర్య పోరాటానికి సర్దార్ పటేల్ వంటి మహనీయులు నాయకత్వం వహించి ఉండకపోతే పరిస్థితిని ఊహించడం కూడా కష్టమే. దేశవ్యాప్తంగా 550కి పైగా రాజ సంస్థానాలను ఆయన విలీనం చేయకపోయి ఉంటే– ఏం జరిగేది?'' అన్నారు. అలాగే భరతమాత పట్ల మన రాజ సంస్థానాలు లోతైన త్యాగభావన, విశ్వాసం ప్రదర్శించి ఉండకపోతే ఏం జరిగి ఉండేది'' అని ప్రధాని ప్రశ్నించారు. "ఈ దుస్సాధ్యమైన పనిని సర్దార్ పటేల్ పూర్తిచేశారు" అన్నారు. "సర్దార్ పటేల్ జయంతి, సమైక్యతా దినోత్సవం మనకు కేవలం క్యాలెండర్‌లోని తేదీలు కాదు. అవి భారతదేశ సాంస్కృతిక శక్తికి గొప్ప ప్రతీకలుగా నిలిచే వేడుకలు. భారత ఐక్యత ఎన్నడూ బలవంతంగా రుద్దబడినది కాదు.. ఇది సదా మన దేశ సహజ స్వభావం. ఐక్యతే మా ప్రత్యేకత" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు.

మోర్బీలో నిన్న సంభవించిన విపత్తు వంటిది వాటిల్లితే బాధితులకు చేయూత కోసం దేశమంతా ఒక్కటై నిలుస్తుందని ప్రధాని అన్నారు. ఆ మేరకు దేశంలోని ప్రతి ప్రాంతం నుంచి ప్రజలు సహాయం అందించడమే కాకుండా బాధితుల క్షేమం కోసం ప్రార్థిస్తున్నారని ఆయన అన్నారు. మహమ్మారి సమయంలో 'చప్పట్లు–తప్పెట్ల' నుంచి ఔషధం, రేషన్, టీకాలదాకా భావోద్వేగ ఐక్యతలో ఈ సమైక్యత పూర్తిగా నిరూపితమైందని ప్రధాని గుర్తుచేశారు. అదేవిధంగా క్రీడా విజయాలు, పండుగలతోపాటు మన సరిహద్దులకు ముప్పు వాటిల్లితే మన సైనికులు పోరాడేటప్పుడు కూడా అదే భావోద్వేగాలు కనిపిస్తాయని, ఇదంతా భారతదేశ ఐక్యతకు ప్రతీక అని ప్రధాని అభివర్ణించారు. మనలోని ఈ ఐక్యత శతాబ్దాలుగా ఆక్రమణదారులకు ముల్లులా మారింది. అందుకే విభజన విత్తనం నాటి దాన్ని పలుచన చేయడానికి ప్రయత్నించారు. అయినప్పటికీ మన చైతన్య ప్రవంతిలో నిరంతర భాగమైన సమైక్యతా మకరందం వారి కుయుక్తులను చిత్తుచేసిందని చెప్పారు. భారత ప్రగతి, పురోగమనంపై నేటికీ కొన్ని శక్తులు అసూయపడుతున్నాయని, దీన్ని వమ్ము చేయడానికి అవి కాచుకు కూర్చున్నాయని హెచ్చరించారు. అదేవిధంగా కులం, ప్రాంతం, భాష, చరిత్ర ప్రాతిపదికగా విచ్ఛిన్నకర ధోరణిని రెచ్చగొట్టే ప్రయత్నాలు కూడా స్పష్టంగా కనిపిస్తున్నాయని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ప్రధాని కోరారు. దేశాన్ని విచ్ఛిన్నం చేసి, నిర్వీర్యం చేసే బానిస మనస్తత్వం, స్వార్థం, బుజ్జగింపులు, బంధుప్రీతి, దురాశ, అవినీతి విషయంలోనూ జాగ్రత్త వహించాలని హెచ్చరించారు. "విచ్ఛిన్నత విషాన్ని మనం సమైక్యత అమృతంతో ఎదుర్కోవాలి' అని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా– "సమైక్యతా దినోత్సవం నేపథ్యంలో సర్దార్ సాహెబ్ మనకు అప్పగించిన బాధ్యతను పునరుద్ఘాటించాలని నేను భావిస్తున్నాను'' అని ప్రధాని వ్యాఖ్యానించారు. ఇందుకు అనుగుణంగా దేశ సమైక్యతను బలోపేతం చేయడం పౌరుల బాధ్యతని ఆయన స్పష్టం చేశారు. ఆ మేరకు బాధ్యతాయుత చైతన్యంతో ప్రతి పౌరుడూ తన కర్తవ్యం నెరవేర్చడానికి సిద్ధమైనపుడే దేశం శక్తిమంతం కావడం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. "ఈ కర్తవ్య స్ఫూర్తి ప్రాతిపదికగా 'అందరి ప్రగతి కోసం, అందరి తోడ్పాటు, అందరి విశ్వాసం, అందరి కృషితో అది సాకారమై భారతదేశం ప్రగతి పథంలో పరుగు తీయగలదు" అని ప్రధానమంత్రి ఉద్బోధించారు. ప్రభుత్వ విధానాలు ఎలాంటి వివక్షకూ తావులేకుండా ప్రతి వ్యక్తికీ దేశం నలుమూలలకూ చేరుతున్నాయని ఆయన తెలిపారు. ఈ మేరకు గుజరాత్ లోని సూరత్ ప్రజలతో సమానంగా అరుణాచల్ ప్రదేశ్ లోని సియాంగ్ లోని ప్రజలకూ కరోనా ఉచిత టీకాలు అందటాన్ని ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. 'ఎయిమ్స్' వంటి వైద్య సంస్థలు నేడు గోరఖ్‌పూర్‌లోనే కాకుండా బిలాస్‌పూర్, దర్భంగా, గౌహతి, రాజ్‌కోట్ సహా దేశంలోని ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటయ్యాయని ప్రధాని గుర్తుచేశారు. తమిళనాడులోనే గాక ఉత్తరప్రదేశ్‌లో కూడా రక్షణ కారిడార్ల అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయని ఆయన తెలిపారు. వేర్వేరు ప్రాంతాల్లో, విభిన్న భాషలు మాట్లాడే ప్రజలున్నారని ప్రధాని గుర్తుచేశారు. అయితే, వరుసలో నిలుచున్న ఆఖరి వ్యక్తికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు సమాన స్థాయిలో ఇంటింటికీ చేరుతున్నాయని ప్రధాని పేర్కొన్నారు.

కనీస అవసరాలు తీరడం కోసం కూడా దేశంలోని లక్షలాది ప్రజలు దశాబ్దాలపాటు ఎదురుచూడాల్సి వచ్చిందని ప్రధానమంత్రి అన్నారు. "మౌలిక సదుపాయాల అంతరం ఎంత తగ్గితే సమైక్యత అంతగా బలోపేతం అవుతుంది" అని ఆయన అన్నారు. ప్రతి పథకం ప్రయోజనం ప్రతి లబ్ధిదారుకూ చేరాలన్న లక్ష్యంతో సంతృప్త సూత్రం ప్రాతిపదికగా భారత్ కృషి చేస్తున్నదని ఆయన పేర్కొన్నారు. 'అందరికీ ఇళ్లు, అందరికీ డిజిటల్ సంధానం, అందరికీ పరిశుభ్ర వంట ఇంధనం, అందరికీ విద్యుత్' వంటి పథకాలను ఈ సందర్భంగా ఆయన ఉదాహరించారు. అయితే, ఈ విధంగా 100 శాతం పౌరులను చేరుకోవాలనే లక్ష్యం సారూప్య సౌకర్యాలకే పరిమితం కాదన్నారు. సమైక్య లక్ష్యాలతోపాటు సమైక్య అభివృద్ధి, సమైక్య కృషి అనే ఉమ్మడి లక్ష్యాన్ని ఈ సూత్రం నొక్కి చెబుతుందని ప్రధానమంత్రి పేర్కొన్నారు. దేశంపైన, రాజ్యాంగం మీద సామాన్యులకు విశ్వాస కల్పనలో ప్రాథమిక జీవితావసరాలు ఒక మాధ్యమంగా మారాయన్నారు. సామాన్యులలో ప్రభుత్వంపై విశ్వాసం ఇనుమడించడానికి అవి ఒక మాధ్యమమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సర్దార్ పటేల్ కలలుగన్న భారతదేశం గురించి చెబుతూ "ప్రతి భారతీయుడికీ సమాన అవకాశం రావాలి... వారిలో సమానత్వ భావన కలగాలనే ఆయన దార్శనికత రూపుదాల్చడాన్ని దేశం నేడు ప్రత్యక్షంగా చూస్తోంది" అని ప్రధాని వ్యాఖ్యానించారు.

దేశంలో దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన ప్రతి వర్గానికి గత 8 ఏళ్లలో ప్రాధాన్యం ఇవ్వడాన్ని ప్రధాని గుర్తుచేశారు. గిరిజనుల ప్రతిష్ఠకు గుర్తుగా ఆత్మగౌరవ దినోత్సవం నిర్వహణ సంప్రదాయాన్ని దేశం ప్రారంభించిందని పేర్కొన్నారు. దీనికి అనుగుణంగా దేశంలోని అనేక రాష్ట్రాల్లో గిరిజన ప్రదర్శనశాలలు నిర్మిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. మాన్గఢ్ ధామ్, జంబుఘోడా చరిత్రను దేశప్రజలు తెలుసుకోవాలని ప్రధానమంత్రి కోరారు. విదేశీ ఆక్రమణదారులు సాగించిన అనేక మారణకాండలను ఎదుర్కొని వారు స్వేచ్ఛను సాధించారని గుర్తుచేశారు. "ఈ వాస్తవాలను తెలుసుకున్నపుడే మనం స్వేచ్ఛ విలువ, సంఘీభావం విలువను అర్థం చేసుకోగలం" అని ఆయన స్పష్టం చేశారు. ఏక్తా నగర్ భారతదేశంలోనేగాక ప్రపంచంలోనే అపూర్వ నగరంగా అభివృద్ధి చెందుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. ప్రజలలో ఐక్యత వల్లనే ప్రజా భాగస్వామ్య శక్తితో నగరం అభివృద్ధి చెందుతున్నదని పేర్కొన్నారు. ఇది కేవలం ఒక ఘనత మాత్రమే కాదని, దీనికొక పవిత్ర దృక్పథం కూడా తోడైందని తెలిపారు. "ప్రపంచంలోనే అతిపెద్ద విగ్రహం ఆవిష్కరణకు స్ఫూర్తి ఎలాంటిదో ఐక్యతా ప్రతిమ రూపంలో మన కళ్లముందే కనిపిస్తోంది" అని శ్రీ మోదీ తెలిపారు.

ఏక్తా నగర్ అభివృద్ధి నమూనాపై ప్రధానమంత్రి మాట్లాడుతూ– పర్యావరణ హిత, అనుకూల నమూనా, దేశాన్ని ప్రకాశింపజేసే ఎల్ఈడీలతో కరెంటు పొదుపు నమూనా, సౌరశక్తితో పనిచేస్తున్న పరిశుభ్ర రవాణా వ్యవస్థ, వివిధ రకాల పశుపక్ష్యాదుల గురించి ప్రజలు మాట్లాడుకునేటపుడు ఈ నగరం వాటన్నిటికీ ఒక ఉదాహరణగా నిలుస్తుందని తెలిపారు. ఇక్కడ నిన్న మియావాకీ ఫారెస్ట్, మేజ్ గార్డెన్ ప్రారంభించే అవకాశం తనకు లభించడాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. ఏక్తా మాల్, ఏక్తా నర్సరీ భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపే అటవీ ప్రపంచం, ఏక్తా ఫెర్రీ, ఏక్తా రైల్వే స్టేషన్ తదితర కార్యక్రమాలన్నీ జాతీయ సమైక్యతను బలోపేతం చేయడానికి ప్రేరణనిస్తాయని ఆయన నొక్కి చెప్పారు. చివరగా– స్వాతంత్ర్యం తర్వాత దేశాన్నీ ఏకీకృతం చేయడంలో సర్దార్ సాహెబ్ పోషించిన పాత్రను ప్రధాని నొక్కిచెప్పారు. శతాబ్దాలపాటు రాజ్యాలేలిన కుటుంబాలు సర్దార్ పటేల్ కృషితో దేశ సమైక్యత కోసం.. కొత్త వ్యవస్థ కోసం తమ హక్కులను కర్తవ్య నిబద్ధతతో త్యాగం చేశాయని ప్రధానమంత్రి గుర్తుచేశారు. వారందించిన సహకారం స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైందని చెప్పారు. "ఈ నేపథ్యంలో నాటి రాజకుటుంబాల త్యాగానికి అంకితం చేస్తూ నేడు ఏక్తా నగర్‌లో ప్రదర్శన శాల నిర్మించబడుతుంది. దేశ ఐక్యత కోసం త్యాగం చేసే సంప్రదాయాన్ని ఇది కొత్త తరాలకు అందిస్తుంది" అని ప్రధానమంత్రి ముగించారు.

ప్రధానమంత్రి దార్శనికత మేరకు ఏటా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు నిర్వహించాలని 2014లో నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు దేశ సమైక్యత, సమగ్రత, భద్రతల పరిరక్షణ, బలోపేతంపై పునరంకితం కావడం లక్ష్యంగా ఏటా అక్టోబర్ 31ని జాతీయ సమైక్యతా దినోత్సవం రూపంలో నిర్వహించాలని నిశ్చయించారు. తదనుగుణంగా కేవడియాలోని ఐక్యతా ప్రతిమ వద్ద ఇవాళ నిర్వహించిన జాతీయ సమైక్యతా దినోత్సవం కార్యక్రమాల్లో ప్రధాని పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎస్ఎఫ్ బలగాలతోపాటు 5 రాష్ట్రాల పోలీసు సిబ్బంది సమైక్యతా దినోత్సవ కవాతు చేశారు. ఈ మేరకు దేశంలోని ఉత్తర, (హర్యానా), పశ్చిమ (మధ్యప్రదేశ్), దక్షిణ (తెలంగాణ), తూర్పు (ఒడిశా), ఈశాన్య మండలాల నుంచి ఒక్కొక్క రాష్ట్రం ఇందులో పాలుపంచుకున్నాయి. అలాగే కామన్వెల్త్ గేమ్స్– 2022లో పతక విజేతలైన ఆరుగురు పోలీస్ క్రీడాకారులు కూడా కవాతులో పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ గెలుపును ఎవరు ఆపలేరు : ఎమ్మెల్యే కోరుకంటి చందర్



కరీంనగర్, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): మునుగోడు నియోజకవర్గంలో టీఆర్ఎస్ పార్టీ గెలుపును ఎవరూ ఆవలేరని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ అన్నారు. సోమవారం మునుగోడు నియోజకవర్గం చండూరు మండలం తుమ్మలపల్లి గ్రామంలో టీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దేశం గర్వించే మహనేత సీఎం కేసీఆర్ అని ప్రతి ఇంటికీ సంక్షేమం ప్రతి ముఖంలో ఆనందమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రాజగోపాల్ రెడ్డి తన స్వార్థ రాజకీయాల కోసమే కాంట్రాక్టుల కోసం మునుగోడులో ఉపఎన్నిక తెచ్చరన్నారు. మునుగోడు అభివృద్ధి జరగాలంటే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వంతో సాధ్యమవుతుందన్నారు. నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ బారినపడి ప్రజలంతా అనారోగ్య కష్టాలు పడుతుంటే నాటి ప్రభుత్వాలు పట్టించికోలేదని, రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ మిషన్ భగీరథ పథకం ద్వారా ఇంటింటికి స్వచ్ఛమైన తాగునీరు అందించి నల్గొండ జిల్లాలో ఫ్లోరైడ్ రహిత జిల్లాగా మార్చారన్నారు. తెలంగాణ ను అన్ని రంగాల్లో నంబర్ వన్ రాష్ట్రం గా తీర్చిదిద్దారన్నారు. ఇంకో సంవత్సరం పాటు పదవీ కాలం ఉన్నా, ఉప ఎన్నిక స్వార్థ ప్రయోజనాల కోసం ఎన్నిక తెచ్చారని, అయితే చైతన్య వంతులైన మునుగోడు ఓటర్లు బీజేపీకి, రాజగోపాల్ రెడ్డికి ఈ ఉప ఎన్నికలో బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఉప ఎన్నికల్లో తెరాస పార్టీ అభ్యర్థి కుసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు.

# యూపీలో మరో ఘటన.. కుప్పకూలిన పాత వంతెన, తప్పిన పెను ప్రమాదం

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:గుజరాత్ రాష్ట్రంలోని మోర్బీలో కేబుల్ బ్రిడ్జి కుప్పకూలి 132 మంది ప్రాణాలు పోగొట్టుకున్న ఘటన మరువకముందే.. ఉత్తరప్రదేశ్‌లో ఇవ్వాల (సోమవారం) అట్లాంటిదే మరో ఘటన జరిగింది. యూపీలోని చందౌలి జిల్లా సరయ్యా గ్రామంలో ఛఠ్ పూజ సందర్భంగా ఓ కాలువపై నిర్మించిన బ్రిడ్జిపైకి జనం పెద్ద ఎత్తున తరలివచ్చారు. పాతబడిన ఆ వంతెన బరువును తట్టుకోలేక ఒక్కసారిగా కుప్పకూలింది. అయితే.. ఈ ఘటనలో ఎలాంటి ప్రాణాపాయం గానీ, ఎవరూ గాయపడటంగానీ జరుగలేదు.వంతెన కూలిన సమయంలో కాలువలో ప్రవాహం పెద్దగా లేకపోవడం, ఎవరూ నీళ్లలో పడిపోకుండా కూలిన వంతెనపైనే ఉండడంతో అందరూ క్షేమంగా బయటపడ్డారు. ఈ ప్రమాదానికి సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హల్‌చల్ అవుతోంది. గుజరాత్, యూపీ ఘటనలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చజరుగుతోంది.

# ప్రత్యేక స్వచ్ఛతా ఉద్యమం 2.0 ధన్‌బాద్‌లోని శతాబ్దపు పాత డిజిఎంఎస్ భవనానికి రంగును జోడించింది.

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ (డిజిఎంఎస్) భవనం సుమారు 114 సంవత్సరాల పురాతనమైనది మరియు ధన్‌బాద్‌లోని పురాతన వారసత్వ భవనాలలో ఇది ఒకటి. సాధారణ హౌస్ కీపింగ్ మరియు నిర్వహణ ద్వారా దీని అసలు రూపంలో నిర్వహించబడుతోంది. ఈ ప్రత్యేక ఉద్యమంలో డిజిఎంఎస్ హెచ్‌ఓలో 100 సంవత్సరాలకు పైగా పాత రికార్డు గది, 1885 నాటి ఫైల్‌లను సురక్షితంగా ఉంచడంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

ప్రత్యేక స్వచ్ఛతా ఉద్యమం 2.0 కింద డిజిఎంఎస్ పరీక్ష విభాగంలో డిజిటలైజేషన్ చొరవ చేపట్టబడింది. మొదటి దశలో 2014 సంవత్సరం వరకు ఉన్న రికార్డులు డిజిటలైజ్ చేయబడ్డాయి మరియు మిగిలినవి డిజిటలైజ్ చేసే ప్రక్రియలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో డిజిఎంఎస్ వివిధ కార్యాలయాలలో పనికిరాని వస్తువులను తొలగించడం ద్వారా ? 2,22,501.00 ఆదాయం వచ్చింది మరియు ఫైళ్లను తిరిగి అమర్చడం మరియు జాబితా చేయడం ద్వారా దాదాపు 110 చదరపు అడుగుల ఖాళీ స్థలం సృష్టించబడింది. భారత ప్రభుత్వం చేపట్టిన ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానం ప్రకారం ఈ కార్యక్రమంలో ఐదు నియమాలు సడలించబడ్డాయి.

డిజిఎంఎస్ మార్గదర్శకత్వంలోని వివిధ రంగాలకు చెందిన ఎస్‌ఓపిలు బొగ్గు మంటలను ఎదుర్కోవడానికి అనుసరించిన పద్ధతి, మ్యాన్ రైడింగ్ సిస్టమ్ (భూగర్భ గని కార్మికుల అలసటను నివారించడానికి), పర్యావరణ పరిరక్షణ కార్యక్రమం (పార్కుల అభివృద్ధి వంటివి, వివిధ అంశాలను కలుపుకొని) వ్యర్థ భూమి/అధిక భారం మీద మొక్కలు జాతులు) మైనింగ్ కంపెనీలచే అమలు చేయబడ్డాయి.

ఈ కార్యక్రమాలు అమలు చేయడం ద్వారా గనుల్లో ప్రమాదాల సంఖ్య గణనీయంగా తగ్గింది. 2022 సంవత్సరంలో మరణాల రేటు దాదాపు 0.15కి తగ్గించబడింది. కార్మికులకు సున్నా హాని కలిగించే లక్ష్యాన్ని సాధించడానికి సంస్థ కృషి చేస్తోంది.

# డ్రగ్స్ కట్టడికి విద్యార్థి దశనుంచే చర్యలు.. ప్రతి స్కూల్లో యాంటీ డ్రగ్ కమిటీ ఏర్పాటు!

హైదరాబాద్, అక్టోబర్ 31:సురక్షితమైన పర్యావరణంలో విద్యార్థులు తమ చదువు కొనసాగించాలని, మరింత బాధ్యతాయుతమైన పౌరులుగా అభివృద్ధి చెందడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని హైదరాబాద్? సిటీ పోలీస్? కమిషనర్? సీవీ ఆనంద్? అన్నారు. అటువంటి వాతావరణాన్ని నిర్మించడానికి యాంటీ డ్రగ్? కమిటీ(ఆఆఅ)లు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందన్నారు. మాదకద్రవ్యాల వ్యాపారం, యువతను చెడు దారి పట్టించకుండా రాష్ట్ర ప్రభుత్వం, నగర పోలీసులు తీసుకుంటున్న చర్యలను ఇవ్వాల (సోమవారం) తెలియజేశారు.

హైదరాబాద్లోని అన్ని కాలేజీలు, విద్యాసంస్థల్లో డ్రగ్స్ నిరోధక కమిటీలను ఏర్పాటు చేయాలని హైదరాబాద్ సిటీ పోలీసులు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో డ్రగ్స్ వ్యాప్తిని అరికట్టేందుకు, యువతకు రక్షణ కల్పించేందుకు చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ కళాశాలలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో తప్పనిసరిగా అధ్యాపకులు, విద్యార్థుల నుంచి ఐదుగురు సభ్యులు ఉంటారని తెలిపారు. ప్రధానంగా మాదకద్రవ్యాల దుర్వినియోగాన్ని నిరోధించడానికి ఈ కమిటీ పని చేస్తుందన్నారు.

మాదకద్రవ్యాల వైపు విద్యార్థులు మొగ్గు చూపకుండా, వివిధ పరిస్థితులను ఎదుర్కోవటానికి మానసికంగా సిద్ధం చేయడానికి ఈ కమిటీ పనిచేస్తుందని సీపీ చెప్పారు. మాదకద్రవ్యాల విషయంలో తోటివారి ఒత్తిడిని నిరోధించేందుకు అవసరమైన నైపుణ్యాలతో యువతకు శిక్షణ ఇవ్వడం చాలా అవసరం అన్నారు. గత రెండేళ్లలో కొవిడ్? మహమ్మారితో విద్యాకు అంతరాయం కలిగిందని, ఆ తర్వాత కళాశాలలు సాధారణ స్థితికి చేరుకున్నందున, యువకులను మరింత జాగృతం చేయడంతో పాటు, పోలీసులు చట్టపరమైన చర్యలను చేపట్టారు. దీంతో హైదరాబాద్? సిటీలో విద్యార్థుల్లో చైతన్యం తేవడం ద్వారా మాదకద్రవ్యాల వ్యాపారాన్ని అరికట్టే చర్యలకు ఉపక్రమిస్తున్నట్టు తెలుస్తోంది.

హైదరాబాద్ పోలీసులు రూపొందించిన మార్గదర్శక సూత్రాల ప్రకారం పనిచేసే ఈ ఏడీసీలు (యాంటీ డ్రగ్ కమిటీలు) తమ క్యాంపస్‌లలో వివిధ డిజిటల్ ప్రచారాలు, వర్క్ షాప్‌లు, సెమినార్‌ల ద్వారా మాదకద్రవ్యాల దుర్వినియోగం, ప్రమాదాల గురించి అవగాహన కల్పించడంలో కీలక పాత్ర పోషించనున్నట్టు తెలుస్తోంది. ఒక కమిటీని ఏర్పాటు చేయడంతో పాటు, విద్యా సంవత్సరం ప్రారంభంలోనే మాదకద్రవ్యాల దుర్వినియోగం వల్ల కలిగే ప్రమాదాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించడానికి, తల్లిదండ్రులు, సిబ్బంది, విద్యార్థులు, ఏజెన్సీల మధ్య సహకార విధానాన్ని నిర్ధారించడానికి సంస్థ అధిపతి ఒక సమావేశాన్ని ఏర్పాటు చేయనున్నట్టు తెలుస్తోంది.

# భూ రిజిస్ట్రేషన్ సమస్యలకు పరిష్కారం

హైదరాబాద్, అక్టోబర్ 31: నియోజకవర్గంలో ఎన్నో ఏండ్లుగా పెండింగ్‌లో ఉన్న భూ రిజిస్ట్రేషన్ల సమస్యల పరిష్కారం కోసం నవంబర్ 2న భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే, ఎంఆర్‌డీసీ చైర్మన్ దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఉదయం ఎమ్మెల్యే నివాసంలో జీహెచ్‌ఎంసీ అధికారులతో బహిరంగ సభ ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ? ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పెండింగ్‌లో ఉన్న భూ రిజిస్ట్రేషన్ల సమస్యల పరిష్కారం కోసం ప్రకటనతో పాటు మంత్రి కేటీఆర్ జీవో కాపీని విడుదల చేస్తారని తెలిపారు.

ఈ ప్రకటన వేలాదిమంది నియోజకవర్గంలోని కుటుంబాలకు మేలు చేకూర్చనున్న నేపథ్యంలో అందరినీ ఒకే చోట చేర్చి సభ ఏర్పాటు చేయబోతున్నామని చెప్పారు. వచ్చే నెల 2వ తేదీన సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో సాయంత్రం 4 గంటలకు బహిరంగ సభను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ పంకజ, డిప్యూటీ కమిషనర్లు సురేందర్‌రెడ్డి, హరి కృష్ణయ్య, మారుతీ దివాకర్, ఎల్బీనగర్ ఏసీపీ శ్రీధర్ రెడ్డి, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లుతో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.



# భక్త జనసంద్రమైన కురుమూర్తి..

## ఘనంగా ఉద్దాల ఉత్సవం

మహబూబ్‌నగర్, అక్టోబర్ 30: జిల్లా పరిధిలోని చిన్న చింతకుంట మండలంలోని పేదల తిరుపతి శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ప్రధాన ఘటమైన ఉద్దాల మహోత్సవం ఘనంగా ప్రారంభమైంది. పల్లమర్రి గ్రామం నుండి ఉద్దాల్ ( చాట ) బయలుదేరి నెల్లికోండి గ్రామం మీదుగా వడ్డేమాన్ గ్రామానికి చేరుకున్నాయి. అక్కడ ప్రత్యేక పూజల అనంతరం అక్కడ్నుంచి ఊకచెట్టు వాగుపై తిర్మలాపూర్ గ్రామం మీదుగా శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి జాతర మైదానానికి సాయంత్రం వరకు చేరుకుంటాయి.

ఈ ఉత్సవాలను చూడటానికి భక్తులు పెద్ద ఎత్తున చేరుకుంటారు. దారి పొడువునా ఆయా గ్రామాల్లో భక్తులు దర్శించుకుని ఊరేగింపులో పాల్గొంటారు. ఆలయం వద్దకు చేరుకోగానే ప్రత్యేక పూజల అనంతరం ఉద్దాలను గుట్టపైకి తీసుకెళ్తారు. భక్తుల సందర్శనార్థం అక్కడ ఉంచుతారు.

ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ స్వర్ణసుధాకర్ రెడ్డి, మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి, అధికారులు, భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

జాతర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. మహబూబ్ నగర్, నారాయణపేట డిపోల నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేశారు.

# సమైక్య స్ఫూర్తి నింపిన వ్యక్తి వల్లభాయ్ పటేల్



ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి పురస్కరించుకుని సోమవారం జిల్లా ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్, జిల్లా అధికారులతో కలిసి దేశ ఐక్యతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతదేశపు ఉక్కు మనిషిగా సర్దార్ వల్లభాయ్ పటేల్ పేరుగాంచారని, ఆయన పుట్టినరోజు జాతీయ ఐక్యత దినోత్సవంగా జరుపుకోవడము జరుగుతుందని అన్నారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత భారత తొలి ఉప ప్రధాని, తొలి హోం మంత్రిగా దేశాన్ని ఐక్యంగా తీర్చిదిద్ది మనలో సమైక్య స్ఫూర్తి నింపిన వ్యక్తి ఆయనని కలెక్టర్ అన్నారు.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, జిల్లా రెవిన్యూ అధికారిణి శిరీష, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కామాంధుడిని కఠినంగా శిక్షించండి

## - దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ పౌండేషన్ డిమాండ్



ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ఖమ్మం నగరం టేకులపల్లి కెసిఆర్ టవర్లో 5 సంవత్సరాల చిన్నారిపై అత్యాచార యత్నం సంఘటనను దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ పౌండేషన్ తీవ్రంగా ఖండించింది. మొన్న హైదరాబాద్ సంఘటన మరిచిపోక ముందే మరో అఘాయిత్యం, చోటు చేసుకోవడం దురదృష్టకరమని నేడు ఇటువంటి కామాంధుల మధ్య చిన్నారులను కాపాడుకోవటం ఎలా అని తల్లిదండ్రులు భయాందళనలో ఉన్నారని దిశా ప్రొటెక్షన్ వెల్ఫేర్ ఫౌండేషన్ చైర్మన్ కావేటి రేవతి ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో కూడా కెసిఆర్ టవర్లో 4 సంవత్సరాల చిన్నారిపై అత్యాచార యత్నం జరిగిందని ఇంకా బయటకి రాని సంఘటనలు మరెన్నో వున్నాయని ఈ అఘాయిత్యానికి పాల్పడిన కామాంధుడిని వెంటనే చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా ఖమ్మం అర్బన్ ఖానాపురం హవేలీ ఎస్పైకి సోమవారం వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా చైర్మన్ కావేటి రేవతి, కమిటీ సభ్యులు పమ్మి అనిత, గణేష్ జ్యోతి, లీగల్ అడ్వైజర్ శ్రుతి, తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 2, 3న నీటి సరఫరా బంద్

హైదరాబాద్, అక్టోబర్ 31: హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న సింగూరు ఫేజ్-3కి సంబంధించి ఇక్రిశాట్ వద్ద 1200 ఎంఎం దయా పీఎస్‌సీ గ్రావిటీ మెయిన్ పైపులైన్‌కు మరమ్మతులు చేపడుతున్నట్లు జలమండలి అధికారులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

వచ్చే నెల 2వ తేదీ బుధవారం ఉదయం 6 గంటల నుంచి మరుసటి రోజు గురువారం ఉదయం ఆరు గంటల వరకు 24 గంటల పాటు సింగూరు ఫేజ్-3లోని రిజర్వాయర్‌కు నీటి సరఫరా నిలిచిపోనున్నది.

ఈ ప్రభావంతో డివిజన్ 9, 15, 24 డివిజన్ల పరిధిలోని బీహెచ్ఈఎల్ ఎంఐజీ, బీహెచ్ఈఎల్ ఎల్ఐజీ, చందానగర్, పాపిరెడ్డి కాలనీ, రాజీవ్ గృహకల్ప, నల్లగండ్ల, హుడా కాలనీ, గోపన్‌పల్లి, లింగంపల్లి, గుల్‌మహర్ పార్కు, నెహ్రూనగర్, గోపీనగర్, దూబే కాలనీల్లో 24 గంటల పాటు నీటి సరఫరా ఉండదని అధికారులు పేర్కొన్నారు. గోపాల్‌నగర్, మయూరి నగర్, మాదాపూర్, ఎస్ఎంఆర్, గోకుల్‌ఫ్లాట్స్, మలేషియా టౌన్‌షిప్, బోరబండ రిజర్వాయర్ల పరిధిలోని ప్రాంతాల్లో లోప్రెషర్ సమస్య ఉంటుందని పేర్కొన్నారు. ఈ అంతరాయాన్ని వినియోగదారులు దృష్టిలో పెట్టుకొని నీటిని పొదుపుగా వాడుకుని అధికారులకు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

# నేడు ఉచిత వైద్యనీ-మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

## - పల్లా కిరణ్ కుమార్

ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): పేదల పక్షపాతి, పీడిత ప్రజల నాయకులు పల్లా జాన్ రాములు 84వ జయంతి సందర్భంగా వారి చిన్న కుమారుడు పల్లా కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో పెద్దలకు మరియు పిల్లలకు ఉచిత వైద్య శిబిరం అలాగే "తలసేమియా" వ్యాధితో బాధపడుతున్న చిన్నారుల కోసం రక్తదాన సేకరణ శిబిరం ఏర్పాటు చేసినట్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరం ఉ.9 గంటల నుండి సా.5 గంటల వరకు చర్చికాంపౌండ్ కమ్యూనిటీ హాల్లో ప్రముఖ వైద్య నిపుణులచే జ్వరము, దగ్గు, జలుబు, బిపి, షుగర్, వంటి పరీక్షలు చేయించి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేస్తారు. కావున నగర ప్రజలందరు ఈ అవకాశాన్ని సద్వినియోగము చేసుకోగలరని కోరారు.

# వినూత్నంగా దీపావళి - స్వచ్ఛతపై స్కూలు పిల్లల నేతృత్వంలో భారీ అవగాహనా ప్రచారం



న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ఈ ఏడాది దీపావళి భారతదేశంలోని అనేక నగరాలకు భిన్నంగా ఉంది. దీపావళి సందర్భంగా సాధారణంగా వినిపించే టపాసుల శబ్దం స్థానంలో 'హ్యూమిన్ గర్వ్ హై' పాట , రోడ్లు, కమ్యూనిటీ వీధుల్లో హరా గీలా సూఖా నీలా నినాదాలు ప్రతిధ్వనించాయి. మొబైల్ వ్యాన్లు, బండ్లు ఇంటింటి నుంచి రెండు బుట్టలతో వేరు చేసిన తడి, పొడి వ్యర్థాలను సేకరించాయి.

చెత్త రహిత నగరాల లక్ష్యాన్ని సాధించే దిశగా గృహనిర్మాణ , పట్టణ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎంఓ హెచ్ యు ఎ) మూలం వద్ద తడి పొడి వ్యర్థాలను వేరు చేయడంపై చేపట్టిన భారీ అవగాహన ప్రచార కార్యక్రమంలో భాగంగా భారతదేశం అంతటా దాదాపు 45,000 పాఠశాలలకు చెందిన 75 లక్షల మందికి పైగా విద్యార్థులు దీపావళి రోజు ఈప్రచారం లో పాల్గొన్నారు. నగర స్థానిక సంస్థలు, మునిసిపల్ కార్పొరేషన్ల నేతృత్వంలో పౌరులు, కమ్యూనిటీ సమూహాలు, కూడా ఈ ప్రచారంలో ఉత్సాహంగా పాల్గొన్నాయి.

"హర గీలా సూఖా నీలా" (తడి వ్యర్థాలకు ఆకుపచ్చ పొడి వ్యర్థాలకు నీలం బుట్టలు) అనే ప్రచార నినాదంతో మూలం వద్ద కనీసం రెండు బుట్టల తడి పొడి వ్యర్థాల విభజన అవసరాన్ని తెలియచేసేలా వవ ప్రచారానికి."స్వచ్ఛతా కే దో రంగ్" (పరిశుభ్రత రెండు రంగులు) అని పేరు పెట్టారు.

స్వచ్ఛభారత్ మిషన్ ద్వారా 32 రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని 3500కు పైగా పట్టణ స్థానిక సంస్థల (యుఎల్ బిలు) ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, కమ్యూనిటీ సమూహాలు ఇంటింటికీ వెళ్లి, గృహస్తులను సమీకరించి మూలాల వద్ద వ్యర్థాల విభజనపై క్షేత్ర స్థాయి అవగాహన కార్యక్రమాలను నిర్వహించాయి. ఆకుపచ్చ లేబుళ్లు (తడి వ్యర్థాల కొరకు) నీలం లేబుల్స్ (పొడి వ్యర్థాల కొరకు), వ్యర్థాలతో చెత్త బుట్టలు , బొమ్మలను తయారు చేయడం, వీధి నాటకాలు వంటి పెయింటింగ్, ఆర్ట్ , క్రాఫ్ట్ వంటి ప్రత్యేక కార్యక్రమాల్లో వివిధ వయస్సుల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని స్వచ్ఛతా కా ఉపహార్ సందేశాన్ని ఇంటింటికీ తీసుకెళ్లారు.

అస్సాంలోని ఖోవాయికి చెందిన పాఠశాల విద్యార్థులు, మహాత్మాగాంధీ స్వచ్ఛ భారతదేశ దార్శనికత ఆధారంగా ఒక నృత్య నాటకాన్ని ప్రదర్శించగా, పాట్నా నగర్ నిగమ్ పాఠశాలలు "వేస్ట్ టు వండర్" అనే ఇతివృత్తంతో వ్యర్థాల నుండి నమూనాలను తయారు చేశాయి.

ఛోటా భీమ్ వంటి పిల్లల అభిమాన పాత్రలు కూడా అవగాహన కల్పించడానికి ఈ నమూనాలలో భాగంగాఉన్నాయి. ఎంసిడి ఆధ్వర్యం లోని కొన్ని పాఠశాలలు విద్యార్థులకు తడి , పొడి వ్యర్థాలను వేరు చేయడం ప్రాముఖ్యతను ప్రదర్శించడానికి జిగ్సా పజిల్స్ ప్రత్యేకమైన ఆటలను కూడా సృష్టించాయి.

స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డుల్లో భారతదేశపు పరిశుభ్రమైన నగరంగా ఆరుసార్లు విజేతగా నిలిచి 7 స్టార్ గార్బేజ్ రహిత నగరం గా నిలిచిన ఇండోర్ దీపావళి తరువాత నగరం అంతటా పరిశుభ్రత డ్రైవ్ నిర్వహించడంలో గణనీయమైన కృషిని ప్రదర్శించింది. అవగాహన ప్రచారంలో భాగంగా, న్యూ ఢిల్లీ మునిసిపల్ కార్పొరేషన్ (ఎన్డిఎంసి) స్వచ్ఛతా మస్కట్ తో వీధుల్లోకి వచ్చింది.

ఫారెస్ట్ ఘాట్ వద్ద స్వీయ సుస్థిర ప్రదేశం లక్ష్యంతో అస్సాంలోని తేజ్‌పూర్ మున్సిపల్ బోర్డ్ ఆధ్వర్యం లో వర్మీ కంపోస్టింగ్ , పిట్ కంపోస్టింగ్ పై స్వయం సహాయక సంఘాల సభ్యులు , నివాసితులకు శిక్షణ నిర్వహించారు.

కేరళలోని మలప్పురం మున్సిపాలిటీ సెగ్రిగేషన్ క్యాంపెయిన్ కింద అంతరాష్ట్ర కార్మికులకు శిక్షణా తరగతులు నిర్వహించింది. సిఆర్ పిఎఫ్ దళాలు కూడా కాశ్మీర్ లోని ఓపిఎస్ సెక్టార్ నుండి ప్రచారంలో చేరాయి. సిఆర్ పిఎఫ్ క్యాంప్ రోడ్లు, తోటలు , ఆవరణలను శుభ్రం చేయడానికి వారు చీపుర్లు పట్టారు.

మూలం వద్ద వ్యర్థాలను వేరు చేసే దేశవ్యాప్త ప్రచారం- పారిశుధ్యం, వ్యర్థాల నిర్వహణ , డంప్ సైట్ లకు వెళ్ళే వ్యర్థాల తగ్గింపు కోసం క్షేత్రస్థాయి కార్యాచరణ ద్వారా దృష్టి సారించే భాగస్వామ్యాన్ని ప్రేరేపించింది. భారీ జన ఆందోళన్ లో అన్ని వర్గాల పౌరులు తమ స్వంత ప్రత్యేక మార్గంలో మూలం వద్ద వ్యర్థాలను వేరు చేయడంపై అవగాహన కల్పించారు ప్రచారాన్ని భారీ విజయవంతం చేశారు. నగరాలను చెత్త రహితంగా చేయడానికి రాష్ట్రాలు తమ శక్తియుక్తులను మళ్లించడం ప్రారంభించినందున ఇప్పటికే క్షేత్ర స్థాయిలో ఈ ప్రభావం కనిపిస్తోంది.

# ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్‌కి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నివాళి



న్యూఢిల్లీ, అక్టోబర్ 31:ఉక్కు మనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ జయంతి సందర్భంగా భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి అమిత్ షా, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనా ఈ రోజు ఢిల్లీలో సర్దార్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సర్దార్ పటేల్ జయంతిని పురస్కరించుకుని ఢిల్లీలోని మేజర్ ధ్యాన్‌చంద్ స్టేడియంలో చేపట్టిన సమైక్యతా పరుగు కార్యక్రమాన్ని కేంద్ర హోంమంత్రి పతాకం ఊపి ప్రారంభించారు. విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖి, కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిశిత్ ప్రమాణిక్ సహా పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ ఐక్యతా పరుగు కార్యక్రమానికి హాజరైన వారితో కేంద్ర హోం మంత్రి, జాతీయ సమైక్యతా ప్రమాణం కూడా చేయించారు.

ఈ సందర్భంగా కేంద్రమంత్రి అమిత్ షా మాట్లాడుతూ, గుజరాత్ లోని మోర్బిలో నిన్న వంతెన కూలిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు తన సానుభూతిని, ప్రగాఢ సంతాపాన్ని తెలిపారు. 75వ స్వాతంత్ర్య వార్షికోత్సవాల సందర్భంగా ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌ను జరుపుకుంటున్నందున నేపథ్యంలో ఈ నాటి కార్యక్రమానికి ప్రత్యేక ప్రాముఖ్యత ఉందని కేంద్ర హోంమంత్రి అన్నారు. స్వాతంత్ర్యానంతరం ఆధునిక భారతదేశానికి పునాదులు వేసి, భారత్ దార్శనికతను సాకారం చేయడంలో తన జీవితాన్ని అంకితం చేసిన వ్యక్తి జయంతి సందర్భంగా జాతీయ సమైక్యత అనే ముఖ్యమైన సందేశంతో ముందుకు వెళ్తున్నామని అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ పేరు చెప్పగానే నేటి సమైక్య భారతదేశం రేఖా చిత్రపటం గుర్తుకు వస్తుందని, సర్దార్ సాహెబ్ లేకుంటే నేటి విశాలమైన, దృఢమైన, శక్తివంతమైన భారతదేశం సాధ్యమయ్యేది కాదని అమిత్ షా అన్నారు.

స్వాతంత్ర్యానంతరం దేశం ఎదుర్కొంటున్న అతి పెద్ద సమస్య 500కు పైగా రాచరిక సంస్థానాలను సమీకృతం చేసి భారత యూనియన్‌ను ఏర్పాటు చేయడమేనని, భారత యూనియన్ రూపకల్పనలో మనదేశ తొలి హోం మంత్రి, ఉప ప్రధాని సర్దార్ సాహెబ్ ప్రధాన పాత్ర పోషించారని అమిత్ షా అన్నారు. తన నైపుణ్యం, అద్వితీయ రాజకీయ చతురతతో యావద్దేశాన్ని ఏకం చేసిన ఘనత సర్దార్ పటేల్‌దేనని అన్నారు. ఆ సమయంలో కూడా దేశవ్యతిరేక శక్తులు దేశాన్ని విభజించడంలో శతవిధాలా ప్రయత్నించారని, అయితే సర్దార్ సాహెబ్ కృషి వల్లనే, ఈ రోజు మనముందున్న సమగ్ర భారతదేశ రేఖా చిత్రపటాన్ని మనం చూడగలుగుతున్నామని ఆయన అన్నారు.

2047వ సంవత్సరంలో భారతదేశం ఎక్కడ, ఏ స్థాయికి చేరుకోవాలో సమిష్టిగా కోరుకుంటూ, ప్రతిజ్ఞ చేయాలని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ లక్ష్యంగా పెట్టుకున్నారని, ఆయన నాయకత్వంలో ఈరోజు భారతదేశం 75వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటోందని కేంద్ర హోంమంత్రి తెలిపారు.

2047లో సర్దార్ సాహెబ్ ఊహల భారతదేశాన్ని రూపొందించడంలో 130 కోట్ల మంది ప్రజల సంకల్పం, దేశంలోని అన్ని రాష్ట్రాల సమిష్టి సంకల్పం తప్పకుండా సఫలీకృతం కాగలదని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం అనేక మైలురాళ్లను అధిగమించిందని అన్నారు. గత ఎనిమిదేళ్లలో బానిసత్వ భావనలన్నింటినీ తొలగించడం ద్వారా ఆత్మగౌరవంతో కూడిన, సుసంపన్నమైన, బలమైన, సురక్షితమైన భారతదేశాన్ని నిర్మించే దిశగా ప్రభుత్వం ముందుకు సాగిందని అన్నారు.

దేశాన్ని ఏకం చేయాలనే ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ దార్శనికతను సాకారం చేయడం ద్వారా ఈరోజు వివిధ దేశాల కూటమిలో భారతదేశం సగర్వంగా నిలుస్తోందని కేంద్ర హోంమంత్రి అన్నారు. సర్దార్ పటేల్ వారసత్వాన్ని విస్మరించేందుకు ఎన్నో ఏళ్లుగా ప్రయత్నాలు జరిగినా, ఆయన గుణగణాల వల్లనే ఆయన అమరుడిగా నిలిచారని, నేడు దేశంలోని యువతకు సర్దార్ పటేల్ స్ఫూర్తిదాయక నాయకుడని అన్నారు. సర్దార్ వల్లభభాయ్ పటేల్ బాటలో ప్రతినబూని నడవాలనే ఉద్దేశంతో నేడు దేశవ్యాప్తంగా సమైక్యతా పరుగులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉక్కు మనిషి సర్దార్ పటేల్ సాధించిన గొప్ప కార్యాలను స్మరించుకుంటూ, సర్దార్ పటేల్ చూపిన మార్గంలో నడవాలని, 2047 నాటికల్లా సర్దార్ పటేల్ సంకల్పాన్ని నెరవేర్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా దేశ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ప.గో జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇద్దరు మృతి

అమరావతి: అక్టోబర్ 31:పశ్చిమ గోదావరి జిల్లా ఆకివీడులో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. వివరాలు ఇలా ఉన్నాయి. ప్రమాదవశాత్తు ఆర్టీసీ బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు ప్రమాదానికి గల కారణాలను ఆరా తీశారు. మృతదేహాలను పోస్ట్ మార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఇంకా పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# జిల్లా పోలీస్ కార్యాలయంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ ప్రతిజ్ఞ కార్యక్రమం

## - సర్దార్ వల్లభాయ్ పటేల్ సేవలు చిరస్మరణీయం: జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని వేడుకలు ఘనంగా నిర్వహించారు పురస్కరించుకుని జిల్లా ఎస్పీ రాహుల్ హెగ్డే సర్దార్ వల్లభాయ్ పటేల్ ఫోటోకు పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం జిల్లా ఎస్పీ అధికారులు, పోలీస్ సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతు

సర్దార్ వల్లభాయ్ పటేల్ పోరాటమే ఊపిరిగా సాగిన ప్రస్థానం దేశ సమగ్రత కోసం శ్రమించిన ధీరత్వం, అప్పుడే స్వతంత్రం వచ్చిన పసిగుడ్డు లాంటి దేశాన్ని ఒంటిచేత్తో ఏకం చేసిన, దేశ విభజనతో జాతి గుండెకు గాయమైన వందలాది సంస్థలను ఒక్కటి చేసిన మహనీయుడికి ఘననివాళి, యావత్ భారతావనిలోని ప్రజలందరూ ఒకే కుటుంబంలో జీవిస్తూ జాతి సమైక్యతకు పునరంకితమై మాతృదేశానికి మన వంతు సేవ చేయడమే స్వాతంత్ర సమరయోధులకు నిజమైన నివాళి అవుతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య,అడ్మినిస్ట్రేషన్ అధికారి హమ్మదుల్లా ఖాన్,ఆర్.ఎస్.ఐ రాజు,కార్యాలయ సూపరిండెంట్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# దేశద్రోహ చట్టానికి పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సవరణ

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:వివాదాస్పదంగా మారిన బ్రిటిష్ కాలం నాటి దేశద్రోహ చట్టానికి వచ్చే పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో సవరణలు చేసే అవకాశం ఉన్నదని కేంద్ర ప్రభుత్వం సుప్రీంకోర్టుకు స్పష్టంచేసింది. భారత శిక్షాస్మృతిలోని సెక్షన్ 124 (ఎ) కింద దేశద్రోహ చట్టాన్ని చేర్చారు. ఈ సెక్షన్ ప్రకారం.. ఎవరైనా ప్రభుత్వ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినా, ప్రభుత్వంపై వ్యతిరేకత పెంచే ప్రయత్నం చేసినా సదరు నేరస్తులుగా పరిగణించబడుతారు.

ఈ నేపథ్యంలో చాలా సందర్భాల్లో ప్రభుత్వాలు ప్రశ్నించిన ప్రతి ఒక్కరిపై దేశద్రోహ చట్టాన్ని ప్రయోగించడం మొదలుపెట్టాయి. అందుకే ఈ చట్టానికి సవరణలు చేయాలని ఏండ్లుగా డిమాండ్‌లు వస్తున్నాయి. దేశద్రోహ చట్టానికి వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో పలు పిటిషన్‌లు కూడా దాఖలయ్యాయి. ఈ పిటిషన్‌లపై విచారణ జరిపిన కోర్టు.. చట్టానికి సవరణలు చేయాలని గత మే నెలలోనే ఆదేశించింది.

అంతేగాక, దేశద్రోహ చట్టంపై కేంద్రం పునఃసమీక్ష పూర్తయ్యేవరకు.. కేంద్ర ప్రభుత్వంగానీ, రాష్ట్ర ప్రభుత్వాలుగానీ ఎవరిమీదా ఈ చట్టాన్ని ప్రయోగించకుండా సుప్రీంకోర్టు స్టే విధించింది. సుప్రీంకోర్టు స్టేపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ కేంద్ర పిటిషన్ దాఖలు చేసినా.. ఆ పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం తోసిపుచ్చింది.

# కరోనా తర్వాత పెరిగిన హృద్రోగ మరణాల రేటు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:2020కి ముందు పెద్దల్లో హృద్రోగాలతో సంభవించే మరణాల రేటు క్రమంగా దిగిరాగా, కరోనా మహమ్మారి తర్వాత మధ్యతరగతి, యువకుల్లో మరణాల రేటు పెరిగిందని సెంటర్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ (సీడీసీ)కు చెందిన ఎపిడెమాలజిస్ట్ వెల్లడించారు. హృద్రోగ తీవ్రత నియంత్రణలో అంతకుముందు పలు దశాబ్దాలుగా సాగించిన పురోగతి కరోనా మహమ్మారితో తుడిచిపెట్టుకుపోయిందని అన్నారు.

1990ల నుంచి అమెరికాలో హృద్రోగ మరణాలు తగ్గుతూ వస్తున్నాయి. అయితే 2020లో చేపట్టిన గణాంకాల సమీక్షలో అన్ని వయసుల వారు, లింగ, వర్ణ వ్యత్యాసాలు లేకుండా హృద్రోగా మరణాల రేటు పెరిగిందని వెల్లడైందని అధ్యయన రచయిత, సీడీసీకి చెందిన రెబెకా సీ వుడ్‌రఫ్ తెలిపారు. నవంబర్ 5-7న చికాగోలో జరిగే అమెరికన్ హార్ట్ అసోసియేషన్ సైంటిఫిక్ సెషన్‌లో ప్రాథమిక పరిశోధన వివరాలను సమర్పిస్తారు.

కొవిడ్-19 మహమ్మారి ముందస్తు ఆరోగ్య సంరక్షణ పొందడం సహా దైనందిన జీవితంలో పలు అడ్డంకులు ఏర్పరిచిందని, దీంతో హృద్రోగాలను ముందుగా గుర్తించి చికిత్స అందించడంలో జాప్యం నెలకొందని వుడ్‌రఫ్ః వివరించారు. హృద్రోగ మరణాలు మరింత పెరుగుతాయని తాము అంచనా వేస్తున్నామని చెప్పారు. 2010 నుంచి 2019 వరకూ జాతీయ హృద్రోగ మరణాల రేటు 9.8 శాతం తగ్గగా, 2020లో ఇది 4.1 శాతం ఎగబాకిందని ఆందోళన వ్యక్తం చేశారు.




# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి



ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 147వ జయంతిని పురస్కరించుకుని అక్టోబర్ 31న నిర్వహించే జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని(రాష్ట్రీయ ఏక్తా దివస్) పోలీసు శాఖ ఆధ్వర్యంలో సిటి ఆర్ముడ్ పోలీసు హెడ్ క్వార్టర్స్ పరేడ్ మైదానంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన అడిషనల్ డీసీపీ ఆడ్మిన్ శభరిష్ భారతదేశ సమగ్రత కోసం పాటు పడిన సర్దార్ వల్లభాయి పటేల్ యొక్క సేవలకు స్ఫూర్తిగా ప్రజల భద్రతకు, శాంతిభద్రతల పరిరక్షణకు ఆహర్నిశలు తమవంతు కృషి చేస్తామని జిల్లా పోలీసు సిబ్బందితో కలసి ప్రతిజ్ఞ చేశారు. ఆనంతరం అడిషనల్ డీసీపీ మాట్లాడుతూ ...సోమవారం సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశం ఆయనను స్మరించుకుంటుందని, భారతీయ ఉక్కుమనిషిగా పిలువబడే సర్దార్ వల్లభాయి పటేల్, దేశసమగ్రభారతావనిని అందించారని అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ దృఢమైన స్ఫూర్తితో దేశం యొక్క ఐక్యత, సమగ్రత, భద్రతను కాపాడటం మన బాధ్యతగా తీసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో ఏఆర్ అడిసినల్. డీసీపీ కుమారస్వామి, ఎస్బి ఏసీపీ ప్రసన్న కుమార్, ఆర్ఐ లు రవి, శ్రీశైలం, సాంబశివరావు పాల్గొన్నారు.

# భారత దేశానికి ఒక రూపాన్ని తీసుకొచ్చిన మహనీయుడు భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్

మెదక్, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి):ఐదు వందలకు పైగా సంస్థానాలను విలీనం చేసి అఖండ భారత దేశానికి ఒక రూపాన్ని తీసుకొచ్చిన మహనీయుడు భారత రత్న సర్దార్ వల్లభాయ్ పటేల్ అని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ అన్నారు. అందరం కలిసి ఉంటే కలిగే ప్రయోజనాలను వివరిస్తూ సంస్థానాలను విలీనం చేయడంలో పటేల్ కీలక పాత్ర వహించారని, ఆయన జన్మదినమైన అక్టోబర్ 31 ను జాతీయ సమైక్యతా దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. సోమవారం కలెక్టరేట్ లోని ప్రజావాణి హాల్ లో జాతీయ సమైక్యతా పై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ చూపిన తెగువ ధైర్యం మూలంగా చిన్న చిన్న సంస్థానాలు దేశంలో విలీనమై అఖండ భార దేశం ఏర్పడిందని అందుకే ఆయనను ఉక్కు మనిషి అంటారన్నారు. ఇందులో హైదరాబాద్ సంస్థానం కూడా కలిసి 75 సంవత్సరాలు పూర్తిచేసుకున్న సందర్భంగా ఇటీవల రాష్ట్రంలో జాతీయ సమైక్యతా వజ్రోత్సవాలను జరుపుకున్నామని గుర్తు చేశారు. ఈ సందర్భంగా దేశ ఐక్యమత్యం, సమగ్రత, భద్రతను కాపాడడానికి అంకిత మవుతామని సత్యనిష్ఠతో దేశ ఏకీకరణకు, దేశాభివృద్ధికి స్వీయ తోడ్పాటు నందిస్తామని అధికారులు, ఉద్యోగులచేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి శ్రీనివాస్, జిల్లా సైన్స్ అధికారి రాజి రెడ్డి, జిల్లా పశు వైద్యాధికారి విజయ శేఖర్ రెడ్డి, జిల్లా మైనారిటీ అధికారి జెంలా నాయక్, జిల్లా సంక్షేమాధికారి బ్రహ్మాజీ, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయనిర్మల, నీటిపారుదల ఈఈ శ్రీనివాస్ రావు, కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా వినతులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే



మెదక్, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ప్రజా వినతులకు ప్రాధాన్యతనిచ్చి సత్వరమే పరిష్కరించవలసినదిగా జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ కుమార్ అధికారులకు సూచించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో డి.ఎస్.ఓ. శ్రీనివాస్ తో కలిసి జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. ప్రధానంగా భూమి పట్టా మార్పిడి, భూమి సర్వే , ధరణిలో మార్పులు, భూ సమస్యలు., పోడు భూముల సమస్యలతో పాటు పింఛన్లు మంజూరు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల మంజూరు, అంగన్వాడీ టీచర్ పోస్టు కావాలని 63 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో ఆసరా పింఛన్లకు సంబంధించి 15, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కావాలని 10 దరఖాస్తులు రాగా మిగతావి భూ సమస్యలు, తదితర శాఖలకు సంబంధించినవి ఉన్నాయి. ఆ దరఖాస్తులను ఆయా శాఖాధికారులకు అందజేస్తూ త్వరితగతిన సమస్యలు పరిష్కరించవలసినదిగా తరుణ్ కుమార్ అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా తూప్రాన్ మండలం నాగులపల్లి గ్రామానికి చెందిన పరశురాములుకు మూడు చక్రాల సైకిలు ను అందజేశారు. కొన్ని వినతులు ఇలా..వెల్దుర్తి మండలం కుకునూర్ గ్రామంలోని సర్వే నెంబరు 580 గుడిబండపై ఏర్పాటు చేస్తున్న కృషే మిషన్ పనులను నిలుపుదల చేయవలసినదిగా ఆ గ్రామా ప్రజలు అభ్యర్థించారు. రోడ్డు నిర్మాణంలో పోతున్న తన భూమికి నష్టపరిహారం ఇప్పించవలసినదిగా కొల్చారం మండలం పోతంశెట్టి పల్లి గ్రామ వాసి లింగుస్వామి విజ్ఞప్తి చేశారు. శివంపేట గ్రామానికి చెందిన స్వయం సహాయక మహిళలు తాము ధాన్యం కొనుగోలు కేంద్రం నిర్వహిస్తామని అవకాశమివ్వవలసినదిగా కోరారు. ఈ కార్యక్రమంలో సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ సహాయ సంచాలకులు గంగయ్య, హార్టికల్చర్ ఏ.డి. నర్సయ్య, ఏడుపాయల ఈ.ఓ. శ్రీనివాస్, సిపిఒ కాసిం, అదనపు డిఆర్ డిఓ భీమయ్య, నీటిపారుదల శాఖా ఈఈ శ్రీనివాస్ రావు, డిఎమ్ అండ్ హెచ్ ఓ విజయనిర్మల, అగ్నిమాపక అధికారి అమరనాథ్ గౌడ్ తదితర జిల్లా అధికారులు, కలెక్టరేట్ ఏ.ఓ. యూనుస్, సూపరింటెండెంట్ బలరాం తదితరులు పాల్గొన్నారు.

## యువతీ యువకుల నుండి (వ్యక్తిగతము మరియు స్వచ్ఛంద సంస్థలు) దరఖాస్తులు

మెదక్, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి):భారత ప్రభుత్వం జాతీయ యువజన అవార్డులు 2020-21 సంవత్సరమునకు అర్హులైన 15-29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకుల నుండి (వ్యక్తిగతము మరియు స్వచ్ఛంద సంస్థలు) దరఖాస్తులు ఆహ్వానిస్తున్నదని జిల్లా యువజన క్రీడల అధికారి నాగరాజ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కేంద్ర ప్రభుత్వ యువజన శాఖ ఎంపికైన అత్యుత్తమ యువజన సంఘానికి పతకం, ప్రశంసా పత్రంతో పాటు 3 లక్షల రూపాయాల నగదు ఇస్తుందని అన్నారు. అలాగే వ్యక్తిగత అవార్డు క్రింద పతకం , ప్రశంసా పత్రం , లక్ష రూపాయల నగదును బహుమతిగా ఇస్తుందని ఆయన పేర్కొన్నారు. కావున జిల్లా లో అర్హులైన యువతీయువకులు, యువజన సంఘాల నిర్వాహకులు గడచిన 2019, 2020, 2021 సంవత్సరాలలో స్వచ్ఛందంగా తాము నిర్వహించిన కార్యక్రమం, జాతి నిర్మాణానికి, సమాజసేవలో వారు పాల్గొన్న /నిర్వహించిన కార్యక్రమాల వివరాలతో awards.gov.in అనే వెబ్ సైట్ నందు దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. నిర్ణీత ఫార్మట్ లో పూర్తి చేసిన అట్టి దరఖాస్తుతో పాటు తాము నిర్వహించిన కార్యక్రమాల వివరాలు తెలియజేసే ఫోటోలు, పత్రిక వార్తలు జతపరిచి (3 సెట్లు) నవంబర్ 3 న సాయంత్రం 5.00 గంటల లోగా మెదక్ కలెక్టరేట్ లోని జిల్లా యువజన, క్రీడల అధికారి కార్యాలయానికి చేరేలా పంపాలని పేర్కొన్నారు. నిర్ణీత తేది దాటిన తర్వాత దరఖాస్తులు స్వీకరించబడవని , ఇతర వివరాలకు http://awards.in// పోర్టల్ ను సందర్శించాలని, లేదా 9347344440, 9493594388 నెంబర్లకు సంప్రదించవలసినదిగా నాగరాజ్ పేర్కొన్నారు.

# సి-295 విమానాల తయారీకి ప్రైవేట్ రంగంలో తొలికేంద్రం!

న్యూఢిల్లీ, అక్టోబర్ 31: ప్రైవేట్ రంగంలో దేశంలోనే ప్రప్రథమంగా సి-295 రకం విమానాల తయారీ కేంద్రానికి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ 2022 అక్టోబర్ 30వ తేదీన శంకుస్థాపన చేశారు. గుజరాత్‌లోని వడోదరలో ఈ తయారీ కేంద్రాన్ని నిర్మించబోతున్నారు. భారత వైమానిక దళం (ఐ.ఎ.ఎఫ్.) కోసం సి-295 విమానాలను వడోదర కేంద్రం తయారు చేస్తుంది. టాటా అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లిమిటెడ్, స్పెయిన్ దేశానికి చెందిన ఎయిర్‌బస్ డిఫెన్స్ అండ్ స్పేస్ ఎస్.ఎ. సంస్థల మధ్య సహకారంతో ఈ కేంద్రం ఏర్పాటవుతోంది. భారతదేశంలో సైనిక విమానాలను ఒక ప్రైవేట్ కంపెనీ తయారు చేయనున్న తొలి ప్రాజెక్ట్ ఇదే. ప్రాజెక్టు మొత్తం వ్యయం రూ.21,935 కోట్లు. పౌర అవసరాలకు కూడా ఈ విమానాలను ఉపయోగించవచ్చు.

శంకుస్థాపన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రధాన మంత్రి ప్రసంగిస్తూ,.. ప్రపంచంలోనే భారతదేశాన్ని ఉత్పాదక కేంద్రంగా మార్చే దిశగా ఈరోజు మనం పెద్ద ముందడుగు వేశామని అన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పలు దేశాల్లో ప్రజాదరణ పొందిన యుద్ధ విమానాలు, ట్యాంకులు, జలాంతర్గాములు, మందులు, టీకాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లు, కార్లను భారతదేశం తయారు చేస్తోందని అన్నారు. 'భారతదేశంలో తయారీ, ప్రపంచంకోసం ఉత్పాదన (మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ద వరల్డ్)' అనే మంత్రంతో భారతదేశం ముందుకు సాగుతోందని, ఇప్పుడు రవాణా విమానాల తయారీలో కూడా భారత్ పెద్దదేశంగా మారుతుందని ప్రధాని వ్యాఖ్యానించారు. 'మేడ్ ఇన్ ఇండియా' అనే పదాన్ని సగర్వంగా చెప్పుకునేలా, ప్రయాణీకుల భారీ విమానాలను త్వరలో మనదేశం తయారు చేయనుందని తాను భావిస్తున్నట్టు ప్రధాని పేర్కొన్నారు. దేశ రక్షణ రంగాన్ని, రవాణా రంగాన్ని మార్చే శక్తి ఈ విమాన తయారీ కేంద్రానికి ఉందన్నారు. భారత రక్షణ రంగంలో ఇంత భారీగా పెట్టుబడులు పెట్టడం ఇదే తొలిసారని అన్నారు. వడోదర కేంద్రంలో తయారయ్యే రవాణా విమానాలు,.. సాయుధ బలగాలను మరింత బలోపేతం చేయడమే కాకుండా, విమానాల తయారీలో కొత్త పర్యావరణ వ్యవస్థ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. "సాంస్కృతిక నిలయంగా, విద్యా కేంద్రంగా ప్రసిద్ధి చెందిన వడోదర నగరం ఇక విమానయాన రంగ కేంద్రంగా క్రమంగా కొత్త గుర్తింపును సాధిస్తుంది" అని ఆయన అన్నారు. వందకు పైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా సంస్థలు (ఎం.ఎస్.ఎం.ఇ.లు) కూడా ఈ ప్రాజెక్టుతో అనుబంధం కలిగి ఉండడం సంతోషదాయకమని ప్రధాని అన్నారు. 'మేక్ ఇన్ ఇండియా, మేక్ ఫర్ ది వరల్డ్' అనే వాగ్దానం ఈ భూమి నుంచి ప్రోత్సాహాన్ని పొందుతుందని, భవిష్యత్తులో ఈ ప్రాజెక్ట్ ఇతర దేశాలకు ఎగుమతి ఆర్డర్‌లను సాధించగలదని ఆయన అన్నారు.

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న విమానయాన రంగం గురించి నరేంద్ర మోదీ ప్రస్తావిస్తూ, విమానాల రాకపోకలకు సంబంధించి ప్రపంచంలోని తొలి మూడు దేశాల సరసన మనం చేరబోతున్నామని అన్నారు. పలువురు ప్రయాణికులను విమానప్రయాణానికి మళ్లించేందుకు ఉడాన్ పథకం ఎంతో దోహదపడుతోందని అన్నారు. ప్రయాణ విమానాలకు, సరకు రవాణా (కార్గో) విమానాలకు పెరిగిన గిరాకీని ఆయన ప్రధానంగా ప్రస్తావించారు. వచ్చే 15 ఏళ్లలో భారతదేశానికి 2,000కు మించి విమానాలు అవసరమవుతాయని అన్నారు. ఈ దిశగా ఈరోజు దేశంలో కీలకమైన ముందడుగు పడిందని, అందుకు తగిన సన్నాహాలను దేశం ఇప్పటికే ప్రారంభించిందని అన్నారు. కోవిడ్-19 వైరస్ మహమ్మారితో, యుద్ధం, సరఫరా వ్యవస్థ అంతరాయాలతో దెబ్బతిన్న ప్రపంచ దేశాలకు భారతదేశం ఒక అవకాశాన్ని అందజేస్తోందని కూడా మోదీ అన్నారు. ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో కూడా భారతదేశంలో వృద్ధి స్థిరంగా ఊపందుకుంటోందని అన్నారు. దేశంలో విమానయానం, తదితర నిర్వహణా పరిస్థితులు నిరంతరం మెరుగుపడుతూ వస్తున్నాయని, ధర విషయంలో పోటీతత్వంతో పాటు నాణ్యతపై కూడా భారత్ దృష్టిని సారిస్తోందని ఆయన వివరించారు. "తక్కువ ధరలో తయారీకి, అధిక స్థాయిలో ఉత్పత్తికి భారతదేశం అవకాశం కల్పిస్తోంది" అని ప్రధాన మంత్రి వ్యాఖ్యానించారు. నైపుణ్యం కలిగిన మానవవనరులతో కూడిన భారీ ప్రతిభా కేంద్రం భారతదేశంలో అందుబాటులో ఉందని అన్నారు.

గత ఎనిమిదేళ్ల లో ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలను ప్రధాన మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ సంస్కరణలతో దేశంలో ఉత్పాదక రంగానికి అపూర్వమైన వాతావరణం రూపుదిద్దుకుంటోందని అన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోటీతత్వంతో సరళీకృత కార్పొరేట్ పన్ను వ్యవస్థను రూపొందించడం, వందశాతం విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులకు (ఎఫ్.డి.ఐ.లకు) అవకాశం ఇవ్వడం, రక్షణ, అంతరిక్ష పరిశోధన రంగాల్లో ప్రైవేట్ కంపెనీలకు మార్గాలను తెరవడం, 29 కేంద్ర కార్మిక చట్టాలను నాలుగు కోడ్‌లుగా సంస్కరించడం, 33,000 అనుమతి నిబంధనలను రద్దు చేయడం, డజన్ల కొద్దీ పన్నులతో కూడిన సంక్లిష్ట వ్యవస్థకు ముగింపు పలకడం ద్వారా వస్తు సేవా పన్నును ప్రవేశపెట్టడం తదితర సంస్కరణ చర్యలను ఆయన ప్రస్తావించారు. "ఈ రోజు భారతదేశంలో ఆర్థిక సంస్కరణల కొత్త యుగం రూపుదిద్దుకుంటోంది. ఈ పరిణామంనుంచి రాష్ట్రాలతో పాటు తయారీ రంగం కూడా అత్యధిక ప్రయోజనాలను పొందుతోంది" అని ఆయన అన్నారు.

దేశం ఆలోచనా విధానంలో మార్పు రావడమే ఈ విజయానికి కారణమని నరేంద్ర మోదీ అన్నారు. కొత్త ఆలోచనలతో, కొత్త పని-సంస్కృతితో ఈ రోజు భారతదేశం పనిచేస్తోందని అన్నారు. దేశంలోని ప్రతిభను, ప్రైవేటు రంగం శక్తిని అణచివేసే మనస్తత్వం, ప్రభుత్వానికి అన్నీ తెలుసుననే భావన ఒకప్పుడు ఉండేదని ఆయన గుర్తు చేసుకున్నారు. ఇప్పుడు 'సబ్‌కా ప్రయాస్' నినాదాన్ని అనుసరిస్తూ, ప్రభుత్వానికి, ప్రైవేట్ రంగానికి సమాన ప్రాధాన్యతను ఇవ్వడం మొదలైందని అన్నారు. కేవలం రాయితీల ద్వారా ఉత్పాదక రంగాన్ని అంతంత మాత్రంగానే ఉంచిన గత ప్రభుత్వం తాత్కాలిక విధానంపట్ల ప్రధాన మంత్రి విచారం వ్యక్తం చేశారు. లాజిస్టిక్ సదుపాయాలు, విద్యుత్ సరఫరా-నీటి సరఫరా వంటి ప్రాథమిక సౌకర్యాలను గతంలో నిర్లక్ష్యం చేశారన్నారు. "తాత్కాలిక నిర్ణయం తీసుకునే పాత విధానాన్ని మేం వదిలేశాం. వివిధరకాల కొత్త ప్రోత్సాహకాలను పెట్టుబడిదారులకు అందించేందుకు ముందుకు వచ్చాం. ఉత్పత్తితో ముడిపడిన ప్రోత్సాహక పథకాన్ని ప్రారంభించాం, ఇది మార్పును ప్రస్ఫుటంగా కనిపించేలా చేసింది. ఈ రోజున, మా విధానాలు సుస్థిరంగా, ఉజ్వల భవిత సాధనకు అనుగుణంగా ఉన్నాయి"అని ప్రధాని అన్నారు. తయారీ రంగం మనకు అందుబాటులో ఉండదని, సేవా రంగంపై దృష్టి పెడితే చాలని గతకాలంలో సాగిన ఆధిపత్యపూరిత ఆలోచనను కూడా ప్రధాన మంత్రి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. "సేవల రంగాన్ని, తయారీ రంగాన్ని, ఇలా రెండింటినీ ఈ రోజున మేం మెరుగుపరుస్తున్నాం" అని ఆయన చెప్పారు. తయారీ రంగం-సేవా రంగం రెండింటిపై దృష్టి సారించే సమగ్ర విధానానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. "తయారీ రంగంలో అందరికంటే ముందు నడవడానికి నేడు భారతదేశం సన్నాహాలు చేసుకుంటోంది," అని ప్రధాని అన్నారు. "నైపుణ్యం, అభివృద్ధిపై గత ఎనిమిదేళ్లలో మేం దృష్టి సారించడం, అందుకు సానుకూల వాతావరణాన్ని సృష్టించడం వల్ల సానుకూల ఫలితం సాధ్యమైంది, తయారీ రంగంలో భారతదేశం అభివృద్ధి ఇపుడు ఈ స్థాయికి చేరింది." అని ఆయన అన్నారు.

పెట్టుబడులకు అనుకూలంగా ప్రభుత్వం చేపట్టిన విధానాలను ప్రధానమంత్రి తన ప్రసంగంలో ప్రధానంగా ప్రస్తావించారు. ఎఫ్.డి.ఐ.ల ప్రవేశంతో ప్రభుత్వ విధాన ప్రయోజనాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఆయన వ్యాఖ్యానించారు. గత ఎనిమిదేళ్లలో 160కి పైగా దేశాల కంపెనీలు భారత్‌లో పెట్టుబడులు పెట్టాయన్నారు. ఇలాంటి విదేశీ పెట్టుబడులు కొన్ని పరిశ్రమలకే పరిమితం కాకుండా ఆర్థిక వ్యవస్థలోని 61 రంగాలకు విస్తరించాయని, భారతదేశంలోని 31 రాష్ట్రాలకు అవి వర్తిస్తున్నాయని ఆయన వివరించారు. కేవలం గగనతల రంగంలోనే 3 బిలియన్ డాలర్లకు పైగా పెట్టుబడులు పెట్టినట్లు ప్రధాని తెలియజేశారు. 2014 తర్వాత, ఈ రంగంలో పెట్టుబడులు భారీగా పెరిగాయని, 2000వ సంవత్సరం నుంచి 2014 సంవత్సరం మధ్యకాలంతో పోల్చితే ఈ పెట్టుబడులు ఐదు రెట్లు పెరిగాయన్నారు. రాబోయే సంవత్సరాల్లో, రక్షణ-అంతరిక్ష రంగాలు 'ఆత్మనిర్భర భారత్' సూత్రానికి మూల స్తంభాలుగా తయారు కాబోతున్నాయని నరేంద్ర మోదీ చెప్పారు. "రక్షణ తయారీ రంగాన్ని 2025 నాటికి 25 బిలియన్ల అమెరికన్ డాలర్ల స్థాయికి మించి పెంచాలని మేం లక్ష్యంగా పెట్టుకున్నాం. రక్షణరంగంలో మన ఎగుమతులు కూడా 5 బిలియన్ల డాలర్లను మించిపోతాయి" అని ఆయన చెప్పారు.

ఉత్తరప్రదేశ్, తమిళనాడు రాష్ట్రాల్లో రూపొందుతున్న రక్షణ రంగ ఉత్పత్తి కారిడార్లు రక్షణ రంగాన్ని బలోపేతం చేయడంలో ఎంతగానో దోహదపడతాయని అన్నారు. ఇటీవల గుజరాత్‌లోని గాంధీనగర్‌లో డిఫెక్స్‌పో పేరిట రక్షణ రంగంలో అత్యంత భారీస్థాయి ప్రదర్శనను నిర్వహించిన రక్షణ మంత్రిత్వ శాఖను, గుజరాత్ ప్రభుత్వాన్ని ఆయన ప్రశంసించారు. డిఫెక్స్‌పోలో ప్రదర్శించిన అన్ని పరికరాలు, సాంకేతిక పరిజ్ఞాన ప్రక్రియలు భారతదేశంలో తయారైనవేనని ఆయన స్పష్టంచేశారు. "ప్రాజెక్ట్ సి-295 ప్రతిఫలం రాబోయే సంవత్సరాల్లో జరిగే డిఫెక్స్‌పోలో కూడా మనకు కనిపిస్తుంది" అని ప్రధాని అన్నారు.

ఈ తరుణంలో దేశంలో పెట్టుబడులకు విశ్వాసాన్ని కలిగించేలా ఏర్పడిన అపూర్వమైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పరిశ్రమతో అనుబంధం కలిగిన వారందరినీ ప్రధానమంత్రి కోరారు. దేశంలోని స్టార్టప్ కంపెనీలు, దేశ పురోగమనానికి సహాయపడే అంశంపై మరింత ఆలోచించాల్సిన అవసరం ఉందన్నారు. పరిశోధనా రంగంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం పెరగడం చాలా ముఖ్యమని ప్రధాన మంత్రి అన్నారు. "ఈ దిశలో మనం ముందుకు సాగితే, ఆవిష్కరణ, తయారీ రంగాల బలమైన వ్యవస్థను రూపొందించ గలుగుతాం. సబ్‌కా ప్రయాస్ అనే మంత్రాన్ని మనం ఎప్పుడూ గుర్తుంచుకోవాలి" అని ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగించారు.

ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ, దేశంలో ప్రైవేట్ రంగం మొదటి తయారీ కేంద్రానికి శంకుస్థాపన చేయడం అంటే,.. అది రక్షణ రంగం 'ఆత్మనిర్భరతా' పయనంలో ఒక కీలకమైన మైలురాయి వంటిదని పేర్కొన్నారు. గుజరాత్‌కు చెందిన జాతిపిత మహాత్మా గాంధీ స్వదేశీ ఉద్యమాన్ని ఇలా ప్రోత్సహించినందుకు టాటా కన్సార్షియం, ఎయిర్‌బస్ సంస్థలను, ఈ ప్రాజెక్ట్‌తో అనుబంధం ఉన్న ఇతర సంస్థలను ఆయన అభినందించారు. సి.-295 అనేది అత్యాధునిక సామర్థ్యాలు, ప్రపంచ ప్రమాణాలతో కూడిన అధునాతన విమానమని రక్షణ మంత్రి అభివర్ణించారు, భారతీయ వైమానిక దళం రవాణా సామర్థ్యాన్ని ఇది అపూర్వమైన రీతిలో బలోపేతం చేస్తుందన్నారు. "భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్, భారత్ డైనమిక్స్ లిమిటెడ్ ద్వారా తయారయ్యే మొత్తం 56 విమానాలకు స్వదేశీ ఎలక్ట్రానిక్ యుద్ధ తంత్ర వ్యూహాలను అమర్చడం అత్యంత ప్రాముఖ్యత కలిగిన విషయం. దేశవ్యాప్తంగా వందలాది ఎం.ఎస్.ఎం.ఇ.లు ఈ ప్రాజెక్ట్‌లో పాలుపంచుకోనున్నాయి. ప్రైవేట్ రంగం, రక్షణ ప్రభుత్వ రంగ సంస్థల (డి.పి.ఎస్.యు.ల) సహకారంతో సాయుధ బలగాల అవసరాలు తీరగలవని చెప్పడానికి ఇది ఒక చక్కని ఉదాహరణ, "అని ఆయన అన్నారు.

స్వదేశీ తయారీ రంగాన్ని ప్రోత్సహించేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ తీసుకున్న చర్యలు సాయుధ దళాల అవసరాలను తీర్చడమే కాకుండా, రక్షణ పరికరాలు/వేదికల నికరమైన ఎగుమతిదారుగా భారతదేశాన్ని తీర్చిదిద్దుతాయని రాజనాథ్ సింగ్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కేంద్రంలో తయారైన విమానం ప్రయాణం,.. పరస్పర సహకారం, రక్షణ సాధికారత, స్వావలంబనల పయనంతో సమానమని అన్నారు.

ఎంతో దార్శనిక దృష్టితో కూడిన ప్రధానమంత్రి నాయకత్వాన్ని రక్షణ మంత్రి ప్రశంసిస్తూ,. నరేంద్ర మోదీని ఒక రాజనీతిజ్ఞుడుగా అభివర్ణించారు, దేశ ప్రస్తుత అవసరాలకు మాత్రమే కాకుండా, భవిష్యత్తు పరిస్థితులను ఎదుర్కొనేందుకు కూడా ప్రధాని నిర్ణయాలు దేశాన్ని సన్నద్ధం చేస్తున్నాయని అన్నారు. ప్రధానమంత్రి తన దార్శనికతతో నిర్దేశించిన 'ఆత్మనిర్భర భారత్' లక్ష్యాన్ని సాధించేందుకు దేశం భారీ ముందడుగు వేస్తోందని, ప్రపంచంలోని బలమైన దేశాల్లో ఒకటిగా భారతదేశం ఎదగాలంటే ఇది అవసరమని ఆయన అన్నారు. "ప్రధాన మంత్రి దూరదృష్టితో కూడిన నాయకత్వం కారణంగా, ప్రపంచ స్థాయిలో భారతదేశం ప్రతిష్ట పూర్తిగా మారిపోయింది. ఇప్పుడు అంతర్జాతీయ వేదికలపై భారత్ ప్రధాన వాణిగా మారింది, మన మాటలను ప్రపంచం శ్రద్ధగా, గౌరవ భావంతో ఆలకిస్తోంది.'' అని రక్షణమంత్రి అన్నారు.

ఈ ప్రాజెక్టులో భాగంగా 16 విమానాలను పూర్తిగా ఎగిరే స్థితిలో బట్వాడా చేస్తారు. 2023 సెప్టెంబర్ 2025 ఆగస్టు మధ్య కాలంలో ఇవి అందుబాటులోకి వచ్చేలా షెడ్యూల్ తయారు చేశారు. మిగిలిన నలభై 40 విమానాలు వడోదర తయారీ కేంద్రంలో తయారవుతాయి. భారతదేశంలో తయారయ్యే మేడ్ ఇన్ ఇండియా మొదటి విమానం 2026 సెప్టెంబరు నుంచి అందుబాటులోకి రావచ్చని అంచనా వేస్తున్నారు.

సి-295 రకం విమానం సమకాలీన సాంకేతిక పరిజ్ఞానంతో 5నుంచి10 టన్నుల సామర్థ్యం కలిగిన రవాణా విమానం. భారతీయ వైమానిక దళంలోని పాతబడిన అవ్రో విమానాల స్థానాన్ని భర్తీ చేసే సి-295 విమానం ఎంతో బలమైనది, విశ్వసనీయమైనది. విభిన్నమైన అనేక కార్యకలాపాలను ఇది నిర్వహించగలుగుతుంది. ఇది బహుముఖమైన సమర్థవంతమైన వ్యూహాత్మక రవాణా విమానం. సుదీర్ఘంగా 11 గంటల వ్యవధి వరకు ఎంతో పటిష్ఠంగా, అన్ని వాతావరణ పరిస్థితులలో బహుముఖ కార్యకలాపాలను నిర్వహించే సామర్థ్యం దీనికి ఉంది. ఇది ఎడారి నుంచి, సముద్ర పరిసరాల వరకు పగలు, రాత్రి తేడా లేకుండా పోరాట విన్యాసాలను నిర్వహించగలదు. వేగంగా ప్రతిచర్యకు దిగే శక్తి సామర్థ్యాలు దీనికి ఉన్నాయి. సైనిక దళాలు సత్వరం ప్రతిచర్యకు దిగేందుకు, సరుకులను జారవిడవడానికి వీలుగా వెనుక భాగంలో ర్యాంప్ తలుపును కలిగి ఉంటుంది. సగం వరకూ సన్నద్ధంచేసిన ఉపరితలాలంలో షార్ట్ టేకాఫ్ చేయుడానికి/దిగడానికి తగిన సామర్థ్యం కలిగి ఉండటం ఈ విమానం మరో ప్రత్యేకత.

టెక్నాలజీ ప్రాధాన్యం, అత్యంత పోటీతత్వం ఉన్న విమానయాన పరిశ్రమలోకి ప్రవేశించడానికి భారతీయ ప్రైవేట్ రంగానికి ఈ ప్రాజెక్ట్ ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తుంది. దేశీయ విమానయాన తయారీ కార్యకలాపాలను ఈ ప్రాజెక్టు మరింతగా పెంపొందిస్తుంది, దీనితో విమానాలకోసం మనం దిగుమతులపై ఆధారపడాల్సిన అవసరం తగ్గుతుంది. ఎగుమతులపై అంచనాలు కూడా పెరుగుతాయి. అలాగే, స్పెయిన్‌లో ఎయిర్‌బస్ సంస్థ తయారీ కేంద్రంలో ఒక విమానం తయారీకి ఉపయోగించే మొత్తం సిబ్బంది పనిలో 96శాతాన్ని భారతదేశంలో టాటా కన్సార్షియం ద్వారా చేపడతారు. పరికరాలు, జిగ్‌లు, పరీక్షా సామగ్రితో పాటు 13,400 కంటే ఎక్కువ డిటైల్ పార్ట్‌లు, 4,600 సబ్-అసెంబ్లీలు, మొత్తం ఏడు ప్రధాన విడిభాగాల కూర్పు, తయారీ ప్రక్రియను భారతదేశంలో చేపడతారు.



## వ్యవస్థపై నమ్మకం లేని వ్యక్తి బండి సంజయ్ : సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని

హైదరాబాద్, అక్టోబర్ 31: కమ్యూనిస్టులపై బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలపై సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు మండిపడ్డారు. చట్టాలు, వ్యవస్థపై నమ్మకం లేని వ్యక్తం బండి సంజయ్ అని, అసహనంతో మాట్లాడుతున్నారని. అడ్డంగా దొరికినా బుకాయిస్తున్నారంటూ ఘాటూనే స్పందించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంబంధం లేని విషయాల్లో బండి సంజయ్ ఎందుకు మాట్లాడుతున్నాడని ప్రశ్నించారు.ఢిల్లీ డీల్‌పై నువ్వెందుకు ప్రమాణాలు చేస్తున్నావని ప్రశ్నించారు. ధైర్యం, దమ్ము ఉంటే మోదీతో ప్రమాణం చేయించాలని డిమాండ్ చేశారు. దేవుడంటే భక్తి లేదని, నమ్మకం లేదని, మతంపేరుతో రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. మునుగోడు ఉప ఎన్నికలో కమ్యూనిస్టు పార్టీలు వేల కోట్లు తీసుకున్నారని అబద్ధాలు ప్రచారం చేస్తున్నాడని, బీజేపీని గద్దె దించేందుకే తాము లౌకిక శక్తులతో పోరాటం చేసేందుకే కలిశామన్నారు. సంజయ్ దమ్ముంటే రాజ్యాంగంపై ప్రమాణం చేయాలని, బీజేపీతో ఎందుకు పొత్తు పెట్టుకున్నారని ప్రశ్నించారు. వారికి ఎన్ని వేల కోట్లు ఇచ్చారని నిలదీశారు.

మీరు చేస్తే సంసారం.. తాము పొత్తు పెట్టుకుంటే తప్పా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్ వ్యవస్థలా సీబీఐ తయారైందని, చాలా రాష్ట్రాలు సీబీఐని బహిష్కరించాయన్నారు.

# కబ'ఢీ' ఛాంపియన్ 'నల్గొండ'

- రన్నర్‌గా నిలిచిన రంగారెడ్డి
- పురుషుల, మహిళల రెండు విభాగాల్లోనూ నల్గొండ, రంగారెడ్డి లదే మొదటి, ద్వితీయ స్థానాలు
- విజయవంతంగా ముగిసిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కబడ్డీ ఛాంపియన్ షిప్ ట్రోఫీ
- పురుష, మహిళా జట్ల విజేతలకు ట్రోఫీ తో పాటు రూ.లక్ష నగదు బహుమతి
- ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి
- కోలాట నృత్యం, బాణసంచా వెలుగుల మధ్య వేదిక పైకి శీనన్న కు ఘన స్వాగతం
- ముగింపు కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు హాజరు
- యువజన విభాగం భీమనాథుల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో పొంగులేటికి ఘన సన్మానం







ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి జన్మదినోత్సవాల్లో భాగంగా పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన పొంగులేటి శ్రీనివాసరెడ్డి కబడ్డీ ఛాంపియన్ షిప్ ట్రోఫి ఆదివారం విజయవంతంగా ముగిసింది. హోరాహోరీగా జరిగిన ఫైనల్ పోరులో పురుషుల విభాగంలో రంగారెడ్డి జట్టు పై నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. మహిళల విభాగంలో కూడా రంగారెడ్డి జట్టుపై నల్గొండ జట్టు విజేతగా నిలిచింది. విజేతలుగా నిలిచిన పురుషుల విభాగం నల్గొండ జట్టుకు, మహిళా విభాగం నల్గొండ జట్టుకు మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ఛాంపియన్ షిప్ ట్రోఫితో పాటు రూ. లక్ష నగదు ను మొదటి బహుమతిగా అందజేశారు. ద్వితీయ స్థానంలో నిలిచిన పురుషుల రంగారెడ్డి జట్టు కు, మహిళల రంగారెడ్డి జట్టు కు రూ. 75 వేల చొప్పున నగదు బహుమతులుగా అందజేశారు. ఇరు విభాగాల్లోనూ నల్గొండ, రంగారెడ్డి జట్లు మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలవడం విశేషం.

### - తర్వాత స్థానాల్లో నిలిచిన ఆరు గురికి కూడా...

మొదటి రెండు స్థానాల్లో కాకుండా తర్వాత ఆరు స్థానాల్లో నిలిచిన పురుషుల, మహిళల జట్లకు కూడా నగదు బహుతులను అందజేశారు. తృతీయ స్థానం రూ. 50వేలు, నాల్గవ స్థానం రూ. 40వేలు, ఐదవ స్థానం రూ. 30వేలు, ఆరవ స్థానం రూ. 20వేలు, ఏడవ స్థానం రూ. 15వేలు, ఎనిమిదవ స్థానం లో నిలిచిన ఇరు విభాగాల జట్లకు రూ. 10వేలను నగదు బహుమతులుగా అందజేశారు. అదేవిధంగా వ్యక్తిగత ప్రతిభతో ఆటలో రాణించిన ఉత్తమ రైడర్, ఉత్తమ డిఫెండర్లుకు సైతం నగదు బహుమతులను అందజేశారు.

### - పొంగులేటి కి ఘన స్వాగతం...

పోటీల ముగింపు కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పొంగులేటి కి నిర్వాహకులు ఘనస్వాగతం పలికారు. కోలాట నృత్యం, బాణాసంచా వెలుగుల మధ్య పూలు చల్లుతూ శీనన్నను వేదిక పైకి ఆహ్వానించారు. అనంతరం జరిగిన పురుషుల, మహిళల ఫైనల్ పోటీలను శీనన్న కబడ్డీ ఆడి ప్రారంభించారు.

### - అట్టహాసంగా ముగింపు...

మూడు రోజుల పాటు ఉత్కంఠ భరితంగా సాగిన కబడ్డీ పోటీల ముగింపు కార్యక్రమాన్ని నిర్వాహకులు అట్టహాసంగా ముగించారు. పోటీల సందర్భంగా నిర్వహించిన కళా,సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను అలరించాయి. బాణాసంచాల వెలుగుల మధ్య ముగింపు వేడుక ఘనంగా సాగింది.

### - ముఖ్య అతిథులు వీరే...

పోటీల ప్రారంభానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో పాటు తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె. జగదీశ్వర్ యాదవ్, డీవైఎస్ వో పరంధామిరెడ్డి , కొత్తగూడెం జెడ్పీ చైర్మన్ కోరం కనకయ్య, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, జారే ఆది నారాయణ, లేళ్ల వెంకట్ రెడ్డి, ఏసీపీ ప్రసన్న కుమార్, సీఐ లు చంటి శ్రీధర్, అంజలి, పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇంఛార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి, పీఎస్ఆర్ ఛారిటబుల్ ట్రస్ట్ బాధ్యులు మువ్వా విజయబాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, బొర్రా రాజశేఖర్, మద్దినేని బేబి స్వర్ణకుమారి , మట్టా దయానంద్, పిడమర్తి రవి, ముదిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఆకుల మూర్తి, చావా శివరామకృష్ణ, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకని జైపాల్, వైరా నియోజక వర్గ ఆత్మ కమిటీ చైర్మన్ కోసూరి శ్రీనివాస రావు, ఎంపీపీ లు సామినేని హరి ప్రసాద్, గోసు మధు, కార్పొరేటర్లు దొడ్డా నగేష్, మలీదు జగన్, చావా నారాయణ , గుర్రం తిరుమల రావు, సామినేని వెంకటయ్య, పోటీల ఆర్గనైజర్ కటికల క్రిస్టోఫర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

### - యువజన విభాగం ఆధ్వర్యంలో పొంగులేటికి ఘనసన్మానం...

తమ అభిమాన నాయకుడు పొంగులేటి శ్రీనివాసరెడ్డి కి యువజన విభాగం ఘన సన్మానం నిర్వహించింది. యువజన విభాగం నాయకులు భీమనాథుల అశోక్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ గజమాలతో పొంగులేటిని సత్కారించారు. తలపాగ, తల్వారు అందజేసి తమ అభిమానన్ని చాటుకున్నారు. వీరితో పాటు ఇంకా అనేక మంది నాయకులు , అభిమానులు పొంగులేటి ని ఘనంగా సత్కరించారు.

### - పోటెత్తిన 'జనం'...

చాలా కాలం తరువాత రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు ఖమ్మం జిల్లా కేంద్రంలో జరగడంతో ఖమ్మం నగరంలోని క్రీడాభిమానులతో పాటు జిల్లా నలుమాలల నుంచి వందలాది మంది పోటీలను వీక్షించేందుకు హాజరైయ్యారు. అంచనాకు మించి జనం రావడంతో పటేల్ స్టేడియం జనసంద్రంతో కిక్కిరిసింది. పోటీల మూడు రోజులు కూడా ప్రజల నుంచి విశేష ఆదరణ కనిపించింది.

# జాతీయ సమైక్యతా ర్యాలీ




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ జూనియర్ కళాశాల వేములవాడ ప్రిన్సిపల్ ప్రమోద్ కుమార్ ఆధ్వర్యంలో జాతీయ సమైక్యత ర్యాలీ విద్యార్థులు నిర్వహించారు విద్యార్థులు సామూహికంగా ప్రతిజ్ఞ చేశారు . ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టౌన్ ఎస్ఐ తిరుపతి పాల్గొన్నారు .ఈ సందర్భంగా ఎస్సై విద్యార్థులకు భద్రతపై అవగాహన విధానాన్ని వివరించారు సమైక్యత విధానాన్ని వివరించారు ఈ కార్యక్రమంలో అధ్యాపకులు ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అంజయ్య కళాశాల అధ్యాపకులు భరత్, సంతోష్ మహేందర్ రెడ్డి దివ్య , అశోక్, రవీందర్ సప్న జ్యోతి లతామంగా, దీపికా నవతా అరుణ , శ్రీనివాసరావు కార్యాలయ సిబ్బంది అరవింద్, ఉడుతల రాము , సంధ్యా తదితరులు పాల్గొన్నారు ప

# దళారులను నమ్మి రైతులు మోసపోవద్దు

## వేములవాడలో వరిధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): వరి ధాన్యాన్ని ,దళారులకు అమ్మి రైతులు మోసపోవద్దని ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ పట్టణంలో ఏర్పాటు చేసిన వరిదాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్యాక్స్ ఏనుగు తిరుపతి రెడ్డి , వేములవాడ మున్సిపల్ చైర్మన్ రామతీర్థపు రాజు మాధవి ప్రారంభించారు. ఈసందర్బంగా వారు మాట్లాడుతూ రైతులు దళారులకు వరి ధాన్యాన్ని విక్రయించి మోసపోకూడదని అన్నారు. ప్రభుత్వం మద్దతు ధర 2060రూ"ఇస్తున్నట్లు తెలిపారు. రైతుల అభివృద్ధికి, ప్యాక్స్ సాగకరిస్తుందని అన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు పెద్దపీట వేస్తూ, రైతులు పండించిన పంటకు మద్దతు ధర ఇస్తుందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం రైతుల పట్ల చూపిస్తున్న వైఖరిని కండించారు. రానున్న రోజుల్లో కేంద్ర ప్రభుత్వనికి రైతులు బుద్ధి చెబుతారన్నారు. కార్యక్రమంలో ప్యాక్స్ వైన్ చైర్మన్,లక్ష్మీకాంతరావు,డైరెక్టర్లు,మున్సిపల్ కౌన్సిలర్లు యాచమనేని శ్రీనివాస్ రావు, నిమ్మచెట్టి విజయ్, మారం కుమార్,సర్పంచ్లు కటకం మల్లేశం,ఏష తిరుపతి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ గడ్డం హనుమాండ్లు, టీఆరెస్ మండల అధ్యక్షుడు గోస్కుల రవి, రైతులు, తదితరులు ఉన్నారు..

# తిరుమలకు పోటెత్తిన భక్తులు.. శ్రీవారి దర్శనానికి 20 గంటల సమయం

తిరుపతి, అక్టోబర్ 31: వారాంతపు సెలవులు కావడంతో శనివారం తిరుమలకు భక్తులు పోటెత్తారు. శ్రీవారి దర్శనార్థం రెండు నడకదారులు, రోడ్డు మార్గాన భక్తులు భారీ సంఖ్యలో చేరుకుంటున్నారు. దీంతో వైకుంఠం క్యూ కాంప్లెక్సులోని కంపార్టుమెంట్లు నిండి క్యూ లైన్‌లు వెలుపలకు వ్యాపించాయి. నారాయణగిరి ఉద్యానవనంలో ఏర్పాటు చేసిన షెడ్లు కూడా భక్తులతో నిండిపోవడంతో శిలాతోరణం వైపు గుండా ఔటర్ రింగ్‌రోడ్డు వైపునకు క్యూ లైన్ వ్యాపించింది. స్వామివారి దర్శనం కోసం దాదాపు రెండు కిలోమీటర్ల మేర భక్తులు క్యూలైన్‌లో వేచివున్నారు.

దీంతో శ్రీవారి ఉచిత దర్శనానికి 20 గంటలు సమయం పడుతుంటే ప్రత్యేక ప్రవేశ దర్శనానికి 5 గంటలు సమయం పడుతుంది. భక్తుల రద్దీ మరో రెండు రోజులు కొనసాగే అవకాశం ఉండడంతో టీటీడీ అధికారులు అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేశారు. క్యూ లైన్‌లోవేచివున్న భక్తులకు శ్రీవారి సేవకుల సహాయంతో అన్నప్రసాదాలు పంపిణీ చేయడంతో పాటు తాగునీరు, మజ్జిగ తదితరాలను పంపిణీ చేస్తుండడంతో భక్తులు కొంత ఉపశమనం పొందుతున్నారు.






# దరఖాస్తులను అధికారులు పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్



ఖమ్మం, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): ప్రజావాణిలో సమర్పించిన దరఖాస్తులను అధికారులు పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పరిషత్ మందిరంలో నిర్వహించిన "గ్రీవెన్స్ డే"లో అర్జీదారులను నుండి కలెక్టర్ దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా, కొనిజర్ల మండలం లాలాపురంకు చెందిన కె. భద్రయ్య తాను ఉపాధి హామీ పథకం క్రింద పనిచేసేవాడినని, లాలాపురం గ్రామ పంచాయతీని వైరా మునిసిపాలిటీ లో విలీనం చేయడంతో తనను పనినుండి తీసేసారని, తాను వికలాంగుడినని, తనకు ఉపాధి కల్పించమని దరఖాస్తు చేయగా, పరిశీలించి తగు చర్యలు తీసుకోవాల్సిందిగా జిల్లా ఉపాధి కల్పనాధికారిని కలెక్టర్ ఆదేశించారు. కామేపల్లి మండలం, ఊటుకూరు గ్రామం నుండి ఎన్. నాగమణి, తాను వితంతువునని, మంజూరయిన ఆసరా పెన్షన్ నిలుపుదల చేశారని, తిరిగి ఇప్పించుటకు కోరగా, డిఆర్డీవో నీ విచారణ చేసి తగు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. కామేపల్లి మండలం ముచ్చర్ల గ్రామం నుండి రేగళ్ల రామారావు, తాను వికలాంగుడినని, ఆసరా పెన్షన్ మంజూరుకు కోరగా, డిఆర్డీవో కు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. తిరుమలాయపాలెం మండలం, గ్రామం నుండి పి. ప్రియాంక, అంగన్వాడీ ఆయా పోస్ట్ లో నియామకానికి కోరగా, పరిశీలించి చర్యలు తీసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారిని కలెక్టర్ ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండలం గుదిమల్ల నుండి బి. వెంకటేశ్వర్లు, తనకు సర్వే నెం. 512ఆ లో ఎకరం పట్టా భూమి ఉండగా, బాబాయి కుమారులు దౌర్జన్యం చేసి ఆక్రమిస్తున్నారని, సహకరించుటకు కోరగా, రూరల్ తహసీల్దార్ కు విచారించి, తగు చర్య తీసుకోవాల్సినదిగా కలెక్టర్ ఆదేశించారు. నేలకొండపల్లి మండలం అనాసాగరం సిహెచ్. రాధ సర్వే నెం. 40/ఇ/1 లో 1.03 ఎకరాల భూమి మిస్సింగ్ సర్వే నెం. గా ఉన్నట్లు చర్యకై దరఖాస్తు సమర్పించగా, అట్టి దరఖాస్తును పరిశీలించి చర్యలు చేపట్టవలసినదిగా ధరణి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. కొనిజర్ల మండలం అంజనాపురం నుండి బెల్లంకొండ సూరమ్మ, తాను పోడు భూమిలో వ్యవసాయం చేస్తున్నట్లు, విచారణ, సర్వే చేసి హక్కులు కల్పించుటకు కోరగా, జిల్లా అటవీ అధికారిని పరిశీలనకై కలెక్టర్ ఆదేశించారు. కల్లూరు మండలం పేరువంచ గ్రామం నుండి శీలం పుష్పమ్మ, 2వ వార్డులో తనకు గల ఇల్లు, వ్యవసాయ భూమి, చెట్లు, కాంపౌండ్ వాల్ గ్రీన్ ఫీల్డ్ రహదారి భూసేకరణ లో కోల్పోయానని, వ్యవసాయ భూమి, చెట్లు, కాంపౌండ్ వాల్ కు మాత్రమే పరిహారం ఇచ్చారని, ఇంటికి పరిహారం మంజూరుకు కొరకై, తనిఖీ చేసి తగు చర్యలకై ఆర్డీవో ను కలెక్టర్ ఆదేశించారు. చింతకాని మండలం నాగులవంచ నుండి నాగలక్ష్మి, తన భర్త ప్రవీణ్ డిఆర్ఎఫ్ లో పనిచేస్తూ, విధుల్లో ప్రమాదవశాత్తూ మరణించారని, తమకు ఇల్లు లేనందున డబల్ బెడ్ రూం ఇల్లు మంజూరుకు కోరగా, తహసీల్దార్ కు చర్యలకై కలెక్టర్ ఆదేశించారు. యూనిటీ అఫ్ మాల అసోసియేషన్ వారు క్రొత్త కలెక్టరేట్ వద్ద డా. బీఆర్. అంబెద్కర్ విగ్రహ ఏర్పాటుకు కోరగా, అదనపు కలెక్టర్, డిడి సాంఘీక సంక్షేమ శాఖ వారు పరిశీలన చేయాల్సిందిగా కలెక్టర్ ఆదేశించారు. టీఎస్ఎఫ్ఐ బాధ్యులు తిరుమలాయపాలెం మండలం బచ్చోడుతాండ కు రెగ్యులర్ కార్యదర్శి నియమించాలని కోరగా, జిల్లా పంచాయతీ అధికారిని చర్యలకై కలెక్టర్ ఆదేశించారు.

"గ్రీవెన్స్ డే"లో అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్. మధుసూదన్, జిల్లా రెవెన్యూ అధికారి శిరీష, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన శివ కృష్ణకు ఆర్థిక సహాయం చేసిన ఎన్నారై గోలి తిరుపతి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): మూడపల్లి ముద్దుబిడ్డ ప్రముఖ ఎన్నారై దుబాయ్ ఎస్ ఆర్ ఆర్ ట్రావెల్స్ అధినేత ఔదార్యం చాటుకున్నాడు వివరాల్లోకి వెళితే ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై మంచానికి పరిమితమై ఆర్థిక ఇబ్బందులతో బాధపడుతున్న చందుర్తి మండల కేంద్రానికి చెందిన రాజురి శివకృష్ణకు ప్రముఖ ఎన్నారై దుబాయ్ ఎస్ ఆర్ ఆర్ ట్రావెల్స్ అధినేత మూడపల్లి గ్రామానికి చెందిన గోలి తిరుపతి ఆర్థిక సాయం చేసి తన మానవత్వాన్ని చాటుకున్నాడు. సోషల్ మీడియా ద్వారా చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజీమ్ శివయ్యను ఆదుకోండి అని సోషల్ మీడియాలో వైరల్ చేయగా ప్రముఖ ఎన్నారై మోతే బాబు సహకారంతో ఎన్నారై గోలి తిరుపతి శివకృష్ణ మెరుగైన వైద్యానికి తన వంతుగా 5000 రూపాయల ఆర్థిక సహాయాన్ని తన తండ్రి గోలి నర్సయ్య చేతుల మీదుగా బాధితునికి సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో చందుర్తి స్పోర్ట్స్ క్లబ్ చైర్మన్ మహమ్మద్ అజీమ్, ఎన్నారై మోతే బాబు, గ్రామస్తులు పిట్టల బాబు, పులి నారాయణ ,మేడిశెట్టి మధు, పొంచెట్టి మహేష్ తదితరులు పాల్గొన్నారు .

# అల్ఫోర్స్‌లో ఘనంగా పటేల్‌కు పుష్పాంజలి



కరీంనగర్, అక్టోబర్ 31: (నేటినిజం ప్రతినిధి): భారతదేశ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ పాత్ర చాలా విశిష్టమైనదని ఆయన చేసిన సేవలు చాలా చిరస్మరణీయమని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక కొత్తపల్లిలోని అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్లో పటేల్ జయంతి , జాతీయ ఐక్యత దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసినటువంటి ప్రత్యేక కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అంతకుముందు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి పటేల్ చిత్రపటానికి పూల మాల వేసి ఘనంగా పుష్పాంజలి ఘటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్దార్ వల్లభాయ్ పటేల్ ధృడసంకల్పానికి పర్యాయ పదం అని అలాగే దేశ రక్షణకై విరోచితంగా పోరాడిన నాయకుడని అభివర్ణించారు. వారి ధృడత్వానికి వారిని భారత ఉక్కు మనిషిగా పిలిచేవారని చెప్పారు. స్వతంత్ర భారతేదశం మొదటి ఉపప్రధానిగా మరియు హె?ంశాఖ మంత్రిగా చాలా గొప్పసేవలు చేసాడని గుర్తుచేశారు. క్లిష్టమైన సమయాల్లో పౌరులందరికి ధృడంగా ఉండాలని మరియు చక్కటి ఆలోచన శైలితో ముందుకు కొనసాగాలని వారు చెప్పారు.

వారు చేసిన సేవలకు మర్యాద సూచకంగా 2018వ సంలో 143వ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని సర్దార్ వల్లభాయ్ పటేల్ గారి కాంస్య విగ్రహాన్ని గుజరాత్ రాష్ట్రంలో ప్రధానమంత్రివర్యులు నరేందర్ మోడీ ఆవిష్కరించారని గుర్తుచేశారు. సుమారు 526 రాష్ట్రాలను తన చతురతతో ఏకం చేసి చిరస్థాయిలో ఉండిపోయిన మహానేత సర్దార్ వల్లబాయ్ పటేల్ గారు అని తెలిపారు. ప్రతిఒక్కరు వారికి మర్యాదగా వారు తెలువబడినటువంటి సూత్రాలను మరియు అభివృద్ధి మార్గాలను అనుసరించాలని సూచించారు.వేడుకలలో భాగంగా భారతదేశ ప్రభుత్వం వారు వారి జయంతిని అధికారికంగా జాతీయ ఐక్యత దినోత్సవంగా ప్రకటించారని మరియు వారి సేవలను యావత్ భారతదేశానికి తెలియజేయడానికి పలు అవగాహన కార్యక్రమాలను చేపట్టి దేశభక్తిని పెంపొందిస్తున్నారని చెప్పారు. విద్యార్థులకు వలు ప్రతిభా పాటవ పోటీలను నిర్వహించి బహుమతులను ప్రధానం చేశారు. విద్యార్థులు పటేల్కు జై. సర్దార్ మీ సేవలు గొప్పవి, పటేల్ మీ జీవితం మాకు ఆదర్శం అనే నినాదాలతో ప్రాంగణాన్ని హెరెంత్తిచారు.

ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయ బృందం , విద్యార్థులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఆశయాలను కొనసాగించాలి

## -వేములవాడ లో ఘనంగా ఇందిరా గాంధీ వర్ధంతి



రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): అఖిల భారత కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షురాలు భారతదేశ మాజీ ప్రధాని ఇందిరా గాంధీ వర్ధంతి వేడుకలను పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి ఆధ్వర్యంలోఘనంగా నిర్వహించారు.

ఈసందర్భంగా ఇందిరాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు ఈసందర్భంగా వెంకటస్వామి మాట్లాడుతూ ప్రధానిగా ఉన్నప్పుడు బడుగు బలహీన వర్గాలకు చేసిన సంస్కరణలపై సంక్షేమ పథకాలను కొనియాడారు. భూ సంస్కరణలు చేపట్టి భూక మతాలు ఏర్పాటు చేసి పేదలకు భూమి పూ హక్కులను కల్పించాలని, అలాగే ప్రభుత్వ భూములను దళితులకు పంపిణీ చేసిన గొప్ప మానవతా వాది ఇందిరమ్మ అని ప్రశంసించారు. ప్రతి గ్రామంలో పేదలకు దళితులకు ఇల్లు నిర్మాణం చేశారని బ్యాంకులను జాతీయకరణ చేసి పేదలకు రుణాలు పొందే సౌకర్యం కల్పించి దేశ ఆర్థిక విధానాన్ని బలపడే విధంగా కృషి చేశారన్నారు. రైతులు పండించిన ధాన్యానికి కనీసం మద్దతు ధర కల్పించేందుకు చట్టాలు రూపొందించి భారత ఆహార సంస్థలను ఏర్పాటు చేసి వ్యవసాయ రంగాన్ని ప్రోత్సహించారన్నారు.

ఈ కార్యక్రమంలో అర్బన్ మండల అధ్యక్షులు పిల్లి కనకయ్య , కాంగ్రెస్ నాయకులు కూరగాయల కొమురయ్య ,చిలుక రమేష్ అరుణ్ తేజ , కనికరపు రాకేశ్, కత్తి కనకయ్య, ప్రభాకర్రెడ్డి ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# వ్యాస రచనలో ప్రతిభ చూపిన వేములవాడ ఎస్ ఐ చల్ల వెంకటరాజం.




రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 31 (నేటినిజం ప్రతినిధి): పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవ వారోత్సవాలలో భాగంగా జిల్లా పోలీస్ లకు నిర్వహించిన వ్యాస రచన పోటీలో వేములవాడ టౌన్ పోలీస్ స్టేషన్ లో విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై చల్ల వెంకట్రాజం కు జిల్లా స్థాయిలో మూడవ బహుమతి వచ్చింది. ఈ సందర్భంగా వెంకట్రాజంకు కు జిల్లా సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ రాహుల్ హెగ్డే మరియు అడిషనల్ సూపరింటెండెంట్ అఫ్ పోలీస్ చంద్రయ్య చేతుల మీదుగా బహుమతి ప్రదానం చేయటం జరిగింది. ఈ సందర్భంగా వెంకట్రాజం ను టౌన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఓ.వెంకటేష్ మరియు సిబ్బంది అభినందించారు.

# గుజరాత్ కేబుల్ బ్రిడ్జి ఘటన.. 141 మంది చావుకు కారణమైన కంపెనీపై కేసు, 9 మంది అరెస్టు

న్యూఢిల్లీ, అక్టోబర్ 31:గుజరాత్‌లోని మోర్బీలో వంతెన కూలి 141 మంది చనిపోయారు. ఈ నదిలో ఇంకా గల్లంతైన వారి కోసం సెర్చ్? ఆపరేషన్? కొనసాగుతోంది. అయితే.. ఇవ్వాల (సోమవారం) ఘటనకు బాధ్యులను చేస్తూ బ్రిడ్జి రిపేరు చేసిన ఓరేవా కంపెనీకి చెందిన తొమ్మిది మందిని అరెస్టు చేశారు. వారిలో బ్రిడ్జిని పునరుద్ధరించిన ఒరేవా సంస్థ అధికారులు, టిక్కెట్లు అమ్మేవారు, భద్రతా సిబ్బంది ఉన్నారు.

మోర్బి జిల్లాలోని ఈ వంతెన నిర్వహణకు 15 సంవత్సరాల ఒప్పందం ఉన్న ఒరెవా కంపెనీ.. దేవ్‌ప్రకాష్ సొల్యూషన్స్ అనే రికార్డులోలేని ఓ చిన్న కంపెనీకి వంతెన రిపేర్లు, సాంకేతిక అంశాలను సెట్ విషయంలో అవుట్‌సోర్స్ కోసం సబ్ కాంట్రాక్ట్ ఇచ్చినట్టు ఆరోపణలు వస్తున్నాయి. కాగా, మార్చి నెలలో చారిత్రాత్మకమైన, బ్రిటీష్ కాలం నాటి ఈ వంతెన మరమ్మతు పనుల కోసం ఒరేవాను నియమించారు. గుజరాతీ నూతన సంవత్సర వేడుకలు జరుపుకున్న అక్టోబరు 26వ తేదీన అంటే.. ఏడు నెలల తర్వాత ఈ వంతెన ప్రజలకు అందుబాటులోకి వచ్చింది.

నిర్వహణ, మరమ్మతుల కోసం వంతెనను కనీసం 8 నుండి 12 నెలల వరకు మూసి ఉంచాలని కంపెనీ తన ఒప్పందానికి కట్టుబడి ఉండకుండా గత వారం వంతెనను తెరవడాన్ని పోలీసులు తీవ్రమైన బాధ్యతారాహిత్యం.. అజాగ్రత్తగా పేర్కొన్నారు. కానీ ఎఫ్ఐఆర్‌లో ఎవరి పేరును పేర్కొనలేదు. వంతెన యొక్క మరమ్మత్తు, నిర్వహణతో పాటు.. నిర్వహణకు ఒప్పందం చేసుకున్న వారు సరైన రీతిలో మరమ్మత్తు పని చేయలేదు అని FIRలో పేర్కొన్నారు.

దాదాపు 500 మంది వ్యక్తులకు నిన్న (ఆదివారం) 12రూపాయల నుంచి 17రూపాయల టిక్కెట్లను విక్రయించారు. దీని ఫలితంగా వేలాడే ఈ తీగల వంతెనపై అధిక భారం ఏర్పడిందని, దీనివల్ల పాత మెటల్ కేబుల్స్ దెబ్బతిని ప్రమాదానికి దారితీసినట్లు పోలీసు అధికారులు తెలిపారు. వంతెనపై ఉన్న కొందరు (125 మంది) బ్రిడ్జిని అటూ ఇటూ.. ఊపడం CCTVఫుటేజీలో కనిపించింది. 2037 వరకు ప్రతి సంవత్సరం టికెట్ ధరలను పెంచడానికి కాంట్రాక్ట్ కంపెనీని అనుమతించింది. గత వారం వంతెనను పునఃప్రారంభిస్తున్నప్పుడు.. ఓరెవా మేనేజింగ్ డైరెక్టర్ జయసుఖ్‌భాయ్ పటేల్ విలేకరులతో మాట్లాడుతూ.. కంపెనీ రెండు కోట్లతో 100 శాతం పునరుద్ధరణ పనులు పూర్తి చేసిందని చెప్పారు. పునరుద్ధరించబడిన వంతెన 8 నుండి 10 సంవత్సరాల వరకు కొనసాగుతుందని కూడా అతను పేర్కొన్నాడు. కానీ, ఇంతలోనే ఇంత పెద్ద ఘోరం జరగడంపై యావత్ దేశం నిర్ఘాంతపోయింది.

# ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం ప్రవేశాల షెడ్యూల్ ఖరారు

హైదరాబాద్, అక్టోబర్ 31: రాష్ట్రంలో ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించిన కౌన్సెలింగ్ షెడ్యూల్ ఖరారైంది. నవంబర్ 2వ తేదీ నుంచి 12 వరకు ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాలను పరిశీలించనున్నారు. నవంబర్ 18, 19వ తేదీల్లో లాసెట్, పీజీఎల్ సెట్ వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవచ్చు. నవంబర్ 22న ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం సీట్లను కేటాయించనున్నారు. నవంబర్ 28 నుంచి ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎం తరగతులు ప్రారంభం కానున్నాయి. తదితర వివరాల కోసం lawcet.tsche.ac.in అనే వెబ్‌సైట్‌ను లాగిన్ అవొచ్చు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.